T.T.D. Religious Publications Series No. 912
Price :


తిరుమల తిరుపతి దేవస్థానములు
ధర్మ ప్రచార పరిషత్

Published by **Sri L.V. Subrahmanyam,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

"బ్రహ్మ మొక్కటే" గ్రంథమాల

# భక్తతిన్నడు

– విద్వాన్ లగడపాటి భాస్కర్



**తిరుమల తిరుపతి దేవస్థానములు,**
**తిరుపతి.**

"బ్రహ్మ మొక్కటే" గ్రంథమాల

# భక్తతిన్నడు


రచయిత

విద్వాన్ లగడపాటి భాస్కర్



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2012

# BHAKTHA TINNADU

**By**
**VIDVAN**
**LAGADAPATI BHASKAR**

T.T.D. Religious Publications Series No:912
© All Rights Reserved

*T.T.D First Edition:- 2012*

Copies: 3000

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Editor- in- Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati

# ముందుమాట

భారతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మ మొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖలను చిత్రించే గ్రంథాలను వ్రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం విద్వాన్ లగడపాటి భాస్కర్‌గారు రచించిన **"భక్తతిన్నడు"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మికచైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

సదా శ్రీవారి సేవలో....

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# ఇందులోని విషయాలు..


(పుట)

1. 'భగవంతుడూ, భక్తుడూ' ఒకరికోసం మరొకరు 1
2. భక్తులు భగవంతుని పరివారంలోని వారే 2
3. మహాభక్తునిగా, ముగ్ధభక్తునిగా తిన్నని కథ ఎలా ప్రసిద్ధమైంది? 6
4. భక్తతిన్నని జననం 8
5. తిన్నని గర్భవాస విశేషాలు 11
6. శిశుదశలో తిన్నని వింతప్రవర్తన 13
7. తిన్నని బాల్యక్రీడలు 15
8. తిన్నని విలువిద్యారంభోత్సవం 17
9. తిన్నడు వేటకు వెళ్లిన విశేషాలు 20
10. తిన్ననికి శివుడు కలలో కనిపించి చేసిన సూచన. 22
11. శివునితో తిన్నని అమాయికసంభాషణ 26
12. తిన్ననితో వేటకు వచ్చిన నేస్తాలు అతణ్ణి ఇంటికి పిలిచిన వైనం 27
13. మరల శివునివాడైపోయిన తిన్నని చేష్టలు 29
14. తిన్నడు శివునికి చేసిన సేవలు, పూజలు 32
15. శివాపచారమని వగచిన బ్రాహ్మణభక్తుడు 35
16. తిన్నని భక్తిని శివబ్రాహ్మణునికి చూపిన శివుడు 36
17. తిన్నడు శ్రీకాళహస్తీశుని కంటిహానికి చెందిన మనస్తాపము 38
18. తిన్నడు శ్రీకాళహస్తీశునికి చేసిన కంటివైద్యము 40
19. తిన్నడు రెండవ నేత్రదాత అయ్యాడు 42
20. కన్నప్పకు సన్నిధి చేసిన శివపార్వతుల అపూర్వ దృశ్యం 43
21. కన్నప్పకంటితో 'భవుడు' భవ్య దయ్యాడట 45

22. శివుని అనుగ్రహాన్ని తిన్న డెలా స్వీకరించాడు? 46
23. తిన్నని లాంటి ముగ్ధభక్తులు మరి కొందరున్నారు 48
24. తిన్నని పూర్వజన్మ వృత్తాంతం 49
25. కన్నప్ప శివునికి నైవేద్యంగా పెట్టిన జంతువుల పూర్వజన్మ వృత్తాంతం. 54

# భక్తతిన్నడు

## 1) 'భగవంతుడూ-భక్తుడూ' ఒకరికోసం మరొకరు

శ్రీరామచంద్రుని స్మరిస్తే వెంటనే గుర్తుకొచ్చే మహాభక్తుడు శ్రీ హనుమంతుడు. శ్రీ శివభగవానుని గుర్తుచేసుకోగానే మనకు గుర్తుకొచ్చే భక్తులు మార్కండేయుడు, ఉపమన్యువు, తిన్నడు లేక కన్నప్ప. శ్రీ మహావిష్ణువుకు ప్రేమపాత్రులూ, పుత్రతుల్యులుగా ప్రసిద్ధి పొందిన భక్తులు ప్రహ్లాదుడూ, ధ్రువుడూను. అలాగే శ్రీకృష్ణ భగవానునికి లెక్కలేనంతమంది అతిసన్నిహితులైన భక్తులు. ఆ స్వామికి మొదటి భక్తులు తల్లిదండ్రులే. కన్నవారైన దేవకీ వసుదేవులూ, ఎంచి, ప్రేమామృతాన్ని పంచి, తరించిన 'యశోదా నందులూను. ఇలా భగవంతుని సేవతో, స్మరణతో, ధ్యానంతో, ధ్యాసతో, తపస్సుతో, తపనతో, బుద్ధితో, శ్రద్ధతో, ఆర్తితో, ఆరాధనతో, ప్రార్థనతో, ప్రేమతో, మోహంతో, ముగ్ధత్వంతో, స్నేహంతో, చేరువతో, దాస్యంతో.... అహో! ఈ భక్తులనే వాళ్లు భగవంతుని ఎన్నిమార్గాల్లో తమవాణ్ణిగా చేసుకుంటున్నారు?

భక్తిమార్గాలు తొమ్మిదింటిలో, ఎనలేని భక్తుల వైవిధ్య భావాలను ఎలా ఇముడ్చడం? రుద్రావతారుడైన హనుమంతుడు శ్రీరామచంద్రునికి సేవకుడా? ఆప్తుడా? సోదరుడా? స్నేహితుడా? పుత్రతుల్యుడా? ధ్రువుడూ, మార్కండేయుడూ పట్టుదలతో భగవంతుని మెప్పించి చిరంజీవులయ్యారు. వ్యాఘ్రపాదమహర్షి కుమారుడు ఉపమన్యువు అసలైన పాలు త్రాగడానికి నోచుకోని పేదకుటుంబంలోపుట్టి, తల్లి సూచనతో తపస్సుచేసి శివుని మెప్పించాడు. ఆ బాలుణ్ణి శివుడు పార్వతీదేవికి తమపుత్ర సమానుణ్ణిగా అప్పగిస్తే, ఆ మాత పాలసముద్రాన్నే వెన్నలాచేసి బాలుడికి తినిపించింది. 'ఆదిదంపతులు' ఆ బాలుణ్ణి తత్త్వజ్ఞానిగా అనుగ్రహించారు. ఆ బాలుడే తరువాతి కాలంలో శ్రీకృష్ణభగవానునికి శివతత్త్వం బోధించగలిగిన గురువయ్యాడు. ఈ భక్తుని భక్తిని 'నవవిధ భక్తిమార్గాల్లో' దేనిలో చేర్చాలి? అలాగే గురువులు చెబుతున్న

విద్యను తిరస్కరించి, తండ్రి దండింపులకు బెదరక, చెదరక స్థిరమైన నారాయణ స్మరణతో, ఎన్నోవిధాల మరణ శిక్షలకూ లొంగక, చివరకు తండ్రి హిరణ్యకశిపునికి ఒకస్తంభంలో శ్రీహరిని నరసింహరూపంలో చూపించిన 'బాలభక్తుడు' ప్రహ్లాదుడు. తన కీర్తనతో, భజనతో ఉగ్రనరసింహుని శాంతపరచాడు. భౌతికంగా సంహరింపబడ్డ తనతండ్రిని క్షమించి ముక్తుడ్ని చేయమన్నాడు. కీర్తన, భజన సంప్రదాయాలకు తానే ఆద్యు డయ్యాడు. రావణ హిరణ్యాక్ష హిరణ్యకశిపుల్లాగే, భగవంతుని 'వైరభక్తి' తో డీకొని ముక్తుడయ్యాడు శిశుపాలుడు. విదురుడూ, కుంతీదేవి, శ్రీకృష్ణునిలో బంధువుకంటే భగవంతుని దర్శించి తరించారు. కుంతీదేవి ఒక్కడుగు ముందుకేసి తాను స్వామిని మరచిపోకుండ ఉండటానికి ఎల్లపుడూ కష్టాలే తనకు ఎదురౌతుండాలని కోరుకొంది. అందరిలా కష్టాలు తీర్చి సుఖసౌభాగ్యాలు ప్రసాదించమనలేదు. విభీషణుడూ, సుగ్రీవుడూ స్నేహంతో భగవంతునికి చేరువయ్యారు. రుక్మిణి ప్రేమతో తన్ను తాను సమర్పించుకొంది. 'కుబ్జ' తనకు తానుగా తన కురూపాన్ని పోగొట్టి సుందరిగా మార్చి తనకొక పుత్రుణ్ణి ప్రసాదించమని శ్రీకృష్ణుణ్ణి కోరుకొనింది. స్వామి ఆమెకోర్కెనూ తీర్చాడు. 'భగవత్ప్రేమ' అసలైన భక్తికి నిర్వచనం. రాధా దేవీ, గోపికలూ స్వామిని ప్రేమించారు. అది అలౌకిక ప్రేమ. నిస్స్వార్థమైన ప్రేమ. శారీరక సుఖభావన అందులో లేదు. స్వామి సంతోషమే తమ సంతోషంగా, అందుకోసం తాము 'ఏ త్యాగానికైనా సిద్ధము' అన్న 'దృఢ సంకల్పం' ఆ ప్రేమలోని అసలు రహస్యం.

**2) భక్తులు భగవంతుని పరివారంలోనివారే.**

సృష్టి, స్థితి, లయ కార్యాలను భగవంతుడు ఒక్కడే నిర్వహిస్తాడు. త్రిమూర్త్యాత్మకుడై భాసిస్తాడు,

**శ్లో॥ అంతస్తమో బహిస్సత్త్వ స్త్రిజగత్పాలకో హరిః,**
**అంతస్సత్త్వస్తమోబాహ్య స్త్రిజగల్లయకృద్ధరః.**
**అంతర్బహిరశ్చైవ త్రిజగత్సృష్టికృద్విధిః**



విష్ణువుగా ఉన్నపుడు 'లోన' తమోగుణం కలవాడై, వెలుపల సత్త్వగుణవంతుడై ముల్లోకాలనూ కాపాడుతాడు! బ్రహ్మగా ఉన్నపుడు లోన 'వెలుపల' 'రజోగుణం' కలిగి, జగత్తును నిర్మిస్తాడు. ఇక మహేశ్వరుడై ఉన్నపుడు ఆ భగవానుడు 'లోన' సత్త్వగుణం కలిగి బయట తమోగుణయుక్తుడై ప్రళయాన్ని కలిగిస్తాడు.

శివుడై ఉన్నస్వామికి ఆయనలాంటి మహిమ కలిగిన పరివారం ఎంతో ఉన్నది. మార్కండేయుని లాగే అల్పాయువుతో, శివుని వరంతోనే, శిలాదునికి జన్మించిన బాలుడు. స్వయంగా తపస్సుచేసి స్వామి సాక్షాత్కారాన్ని పొందాడు. అంతేకాదు. అందరు భక్తులూ సామాన్యంగా కోరే వరలాభాన్ని కోరలేదు. తెలివిగా స్వామి నిత్యసన్నిధిని కోరాడు. ఫలితంగా అతడు నందికేశ్వరుడై స్వామికి వాహనంగా, శివపరివారానికి అధ్యక్షుడుగా, నిత్యసన్నిధితో సాక్షాత్ శివుని ప్రతినిధిగా, గణాధ్యక్షుడుగా మారాడు. తనతో విరోధించి. తనువు చాలించిన గజాసురుని చర్మమే శివుడు కట్టుబట్టగా స్వీకరించాడు. నాగులను ఆభరణాలుగా చేకొన్నాడు. దోషాకరుడని నిందపడ్డ చంద్రుని 'సిగపూవుగా' చేసుకొన్నాడు. భక్తుడైన బాణునికి బంటే అయ్యాడు.

ఇక శ్రీకాళహస్తిక్షేత్ర స్వామిగా, అష్టశరీరుడైన పరమేశ్వరుడు వాయులింగేశ్వరుడై, కృతయుగంనుండి, ఇప్పటి కలియుగందాక ఎందరో భక్తులను అక్కున చేర్చుకున్నాడు. అందులో కారణాంతరాలతో మూగజీవులై పుట్టిన సాలీడు (శ్రీనాముడు) ఉన్నాడు. సర్పం (కాళుడు) ఉన్నది. (హస్తినామధారి) ఏనుగూ ఉన్నది. ఇంద్ర, యమ, వాయు దేవులూ ఈ స్వామిని కొలిచి తమకోర్కెలు సిద్ధింపజేసుకొన్నారు. సృష్టికర్త బ్రహ్మ, మహర్షి వసిష్ఠుడూ, భక్తితో సేవించి ఈ స్వామి కృపతో పుత్రశోకాన్ని, సంసార దుఃఖాన్నీ పోగొట్టుకోగలిగారు.

వాయులింగమై వెలసి ఉన్న శ్రీకాళహస్తీశ్వరుని నాల్గుయుగాల చరితను, స్థలపురాణం, లో (రో) మశమహర్షి, భరద్వాజమునికి విపులంగా వివరించాడు. అందులో స్వామిచేత ఉద్ధరింపబడిన ఎందరో భక్తుల అద్భుత అపురూప

గాథలున్నాయి. త్రేతాయుగంలో శ్రీమన్నారాయణుడు తపస్సుచేసి శివానుగ్రహంతో 'సభాపతిత్వం', సర్వలోక పూజనీయత పొందాడట! శ్రీమహాలక్ష్మి శ్రీజ్ఞానాంబికను పూజించి సంపదలకు అధినేత్రిగా అత్యంత సౌందర్యవతిగా, శ్రీనారాయణుని భర్తగా పొందగలిగిన భాగ్యవతి అయ్యింది. శివపుత్రుడు శ్రీకుమారస్వామి ఇక్కడ తపస్సుచేసి, స్వామి వల్ల విద్యారహస్యాలు సంపాదించి విద్యాగురుడయ్యాడు. శ్రీరామచంద్రుడు తపస్సుచేసి చిత్తశాంతిని పొందాడు. మార్కండేయుడు కూడ ఈ చోట తపస్సుచేశాడు. సుదర్శను (చక్రం)డు తపస్సు చేసి పాపపరిహారంపొందాడు. ఇలా ఎంద రెందరో గడచిన యుగాల్లో ఈ స్వామిని సేవించి తరించిన భక్తులు. లెక్కపెట్టడం సాధ్యపడదు, ఈ క్షేత్రం ఉన్న పట్టణం 1. కృతయుగంలో బ్రహ్మపురంగా 2.త్రేతాయుగంలో విష్ణుపురంగా, 3.ద్వాపరంలో నారదపురంగా 4. కలియుగంలో వరగుణపురంగా ప్రసిద్ధిపొందింది. వరగుణుడు అనబడేవాడు కూడా వాయులింగేశుని సేవించి తరించిన భక్తశ్రేణిలో ఒక్కడు, అయితే, యుగయుగాలుగా ఈ స్థలానికి స్థిరంగా ఉన్న పేరుమాత్రం 'శ్రీకాళహస్తి' అనేదే కాకతాళీయంగా సాలీడు, కాళము, హస్తి శివుని సేవించి ముక్తులవుతూ తమపేర్లు కూడ స్థలనామంలో లీనం కావడానికి కారణమైనట్టు స్థలపురాణం తెలుపుతున్నది.

ఇలా 'మూగజీవుల' నుండి 'బ్రహ్మ' దాక, ఎన్నో స్థాయిల్లో ఉన్నభక్తులు శివసేవకులై, భక్తులై, ముక్తులై, భావితరాల భక్తిమార్గానికి మార్గ దర్శకులయ్యారు. శివాలయంలో శివరాత్రి నాడు ఆకటికి ఆగలేక, శివనైవేద్యమైన ప్రసాదాన్ని దొంగిలించబోయిన కులభ్రష్టుడు, పాపి అయినవాడు శివాలయ ప్రాంగణంలో చంపబడగా, ఆతని పాపాన్ని పోగొట్టి రెండవజన్మలో శివభక్తుడైన రాజుగా, కాశీలో దీపోత్సవవ్రతం చేసిన భక్తునిగా ఆపైజన్మలో శివునికి స్నేహితుడుగా 'ధనాధిపతి' 'కుబేరుని' గా చేసింది కరుణా సాగరుడైన శివభగవానుడేకదా! ఒక నిరుపేద శూద్రయువకుడు, అకస్మాత్తుగా శివభక్తుడై, శివభక్త శిఖామణిగామారి, ఆపైజన్మలో బ్రాహ్మణ కుటుంబంలో శిశువైపుట్టాడు. ఈశానుడనే పేరు పెట్టిన ఆతని తల్లిదండ్రులు పిల్లవాడు పెద్దవాడయ్యేదాక



కూడ మాటలాడకుండ, శివభక్తి స్మృతిలో మౌనంగా ఉండిపోగా, దుఃఖితులయ్యారు. కాని, వందేళ్ల తర్వాత ఆయనకు శివుడు దర్శన మిచ్చి వరం కోరుకొమ్మన్నాడు. తెలివిగా ఆతడు అమరత్వం సాధ్యంకాదన్న స్వామితో, తన శరీరంలోని రోమాల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క కల్పంలో రాలిపడే వరమిమ్మని కోరాడు. ఒంటిమీద రోమాలెన్ని కోట్లో? అన్ని కల్పాలు అమరుడై జీవించే విధంగా, ఆ భక్తుడు తన జీవితకాలాన్ని పొడిగించుకోదలిచాడు. పరమేశ్వరుడు ఆ వరం ఇవ్వనే ఇచ్చాడు. ఆతడే రో(లో)మశమహర్షి. ఈ సన్నివేశాన్ని స్కంద పురాణం (కుమారీ–ఖం–12/41)లో ముక్తాయించిందిలా..

**శ్లో॥ న దుర్లభం న దుష్ప్రాయం న చాసాధ్యం మహాత్మనామ్,**
**శివభక్తీ కృతాం పుంసాం త్రిలోక్యామితి నిశ్చితమ్.**

ఇలా పరిశీలిస్తూపోతే భక్తులు పూర్వజన్మ సుకృతంవల్ల, అకస్మాత్తుగా కలిగిన ప్రేరణ వల్లనో, ప్రబోధం వల్లనో పరమాత్ముని ప్రేమలో లీనమై తమ చుట్టూవున్న ప్రపంచాన్ని నీరసంగా, శూన్యంగా, ఫలరహితంగా భావిస్తారు. సుఖశాంతులకు గతి–ప్రగతి, అతి–నిరతి, ఉన్నతీ ఇత్యాదులను స్ఫురింప జేయడానికీ, మేల్కొల్పడానికీ మూలకారణం భగవత్ప్రేమే నంటారు పెద్దలు. ఈ విషయాన్నే అద్వైతకర్త, ప్రవక్త శ్రీఆదిశంకరులు భగవత్ప్రేమలోని సార్థక్యం, అనివార్యాదులను గురించి నొక్కి చెబుతూ **''మోక్షకారణ సామగ్ర్యాం భక్తిరేవగరీయసీ''** అన్నారు. ఆ భావనతోనే ఆయన భగవత్ప్రేమలోని గరిమ, మహిమ, సత్తా–మహత్తా, ఉపయోగమూ, అవసరమూ ఉన్నట్టు వివరించాడు. ఆయన మతానుసారం ముక్తాత్ములుకూడ భగవత్ప్రేమలోని రసాస్వాదన చేయడానికి, లీలామానుష రూపధారణచేసి పరమాత్ముని 'భజన' చేస్తారు. ''మూక్తా అపిలీలయా విగ్రహం కృత్వా తం భజన్తే''. ఈ భగవత్ప్రేమనే 'పంచమ పురుషార్థం' గా జ్ఞానులు పేర్కొన్నారు. ఇదే భోగులను యోగులుగా, లోభులను దానవీరులనుగా, స్వార్థపరులను పరమార్థసాధకులుగా మార్చుతుంది.

శ్రీకాళహస్తీశ్వరుని చూడాలనికానీ, పూజించాలని కానీ వేటకోసం వెళ్లిన ఆటవిక బాలుడు అనుకోలేదు. పుట్టుకతోనే వచ్చిన తిన్నదనం,

నెమ్మదిగుణం, సాధుస్వభావం కలిగిన తండె, నాథనాథులు తమ కొడుక్కి ఆ తల్లిదండ్రులు 'నడవడినిబట్టి' తిన్నడు' అని పేరు పెట్టుకున్నారు. ఆతడే తరువాత 'కన్నప్ప'గా ప్రసిద్ధుడయ్యాడు. కులసంప్రదాయాన్నిబట్టి వేటలో మెలకువలు, అనుభవం కలవారి వెంట వెళ్లి నేర్చుకోవడానికి వెళ్లిన 'తిన్నడు' వాయులింగరూపుడైన శ్రీకాళహస్తీశుని చూచి, పరవశించి, 'వేదేతర మతం'లోనైనా విశ్వేశ్వరుని అర్చించి, మెప్పించి సాయుజ్యమందిన దివ్యగాథ మాన్యులైనా, సామాన్యులైనా మరల మరల చదువదగిందే.

### 3) మహాభక్తునిగా, ముగ్ధభక్తునిగా తిన్నని కథ ఎలా ప్రసిద్ధమైంది?

కవిగానేకాక, వీరశైవమతవ్యాప్తికి కృషిచేసిన మహాప్రవక్తగా పేరుపొందిన పాల్కురికి సోమనాథుని ద్విపద బసవపురాణంలో 'ఉడుమూరికన్నప్ప' అనే కథ ఉన్నది. అదే కవి తన 'పండితారాధ్యచరిత్ర' (ద్విపద)లో, పలుతావుల్లో ఆ భక్తుని 'కన్నప్పదేవుడు' అని ప్రస్తావించాడు. ముఖ్యంగా తన చెప్పుకాలిని శివలింగానికి తాకించిన విషయమూ, పుక్కిట పట్టి తెచ్చిన 'సువర్ణముఖరీ' జలాలతో శివుని అభిషేకించిన విషయము, 'పందిమాంసాన్ని' నైవేద్యంగా పెట్టి స్వామిని అర్చించిన విషయమూ, పదేపదే ఇతర భక్తుల కథలు చెప్పే సందర్భంలోను ప్రస్తావించాడు. అరవభాషలో, కన్నడంలోను ప్రచారంలో ఉన్న ఈ భక్తుని కథ, కన్నులకు కట్టినట్టు తెలుగులో మొదట బసవ పురాణంలోనే మనకు పరిచయమౌతుంది.

ఆతని తరువాత సుమారు మూడుశతాబ్దాలు గడిచాక, శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో ధూర్జటి మహాకవి 'తిన్నని' కథగా ఈ భక్తుని కథను మనకు అందించాడు, శివునికి కన్నప్పగించి 'కన్నప్పగా' ప్రసిద్ధి చెందినట్టు కవులు పేర్కొన్నారు. శ్రీశంకర భగవత్పాదులు కూడ తన శివానందలహరిలో 'కన్నప్ప' అనే పేర్కొన్నాడు.

**శ్లో॥ మార్గావర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే**
**గండూషాంబు నిషేచనం, పురరిపోః పీయూషధారాయతే,**



**కించిద్భక్షిత మాంసశేష కబళం నవ్యోపహారాయతే**
**భక్తిం కిం న కరోత్యహో! వనచరో భక్తావతంసాయతే.**

"ఓ పశుపతీ! నడిచే కాలిచెప్పునకు నీశిరస్సు రంగస్థలమయ్యింది. పుక్కిట బట్టిన ఎంగిలినీరు నీకు అభిషేక జలమయింది. (దప్పికదీర్చేనీరయ్యింది.) తాను కొంచెం రుచి చూసిన 'ఎంగిలి మాంస కబళం' నీకు అంటులేని నైవేద్యమయ్యింది. భక్తి అనేది ఎంతటి కార్యాన్ని సాధించలేదు. (సాధిస్తుంది) ఆహా! ఒక ఆటవికుడు భక్తులలో ఉత్తముడు అయ్యాడు కదా!"

ఆదిశంకరుల నివాళి అది.

ఈ విషయాన్నే శ్రీకాళహస్తీశ్వర శతకంలో 'ధూర్జటి' కవి ఒక పద్యంలో ఇలా పొగిడాడు.

**శా. దొప్పెం డెంగిలి దెచ్చి యిచ్చినను గండూషాంబుధారావళిన్**
**దొప్పందోగిన చెప్పుగాల తలపై ద్రొక్కంగ నట్టైన గ**
**న్నప్పం బాత్రుని జేసి తంతటికి, సన్మానంబు దీపింపఁగా**
**చెప్పన్నేరము నీ విహార మహిమల్ శ్రీకాళహస్తీశ్వరా!**

ఈ పద్యం ప్రముఖంగా ప్రచురితమై ప్రచారంలో ఉన్న శ్రీకాళహస్తీశ్వర శతకాల్లో కానరాదు. అన్నింటిలో 116 పద్యాలే ఉన్నాయి. డా॥ దివాకర్ల వేంకటావధానిగారు సేకరించి ప్రకటించిన శివశతక సంపుటంలో ఈ పద్యంఉన్నది.

శ్రీకాళహస్తీశ్వరా! ఒకదొన్నెడు ఎంగిలి చేసిన మాంసపుముక్కలు తెచ్చియిచ్చినందుకు, పుక్కిటి నీటితో నిన్ను ముంచి నందుకు, తలపై చెప్పుకాలు పెట్టి తొక్కినందుకు, 'కన్నప్ప' అనే అమాయకునికి 'గౌరవం' లభించింది! అతడు నీ అనుగ్రహానికి పాత్రుడు కూడ అయ్యాడు. నీవిలా చేయడానికి కారణ మేమిటో! నీమహిమ ఎంతటిదో ఎవ్వరు ఊహింపలేరు కదా!

ఈ వర్ణన ఆదిశంకరుల వర్ణనలాగే మధుర మనోహరంగా ఉంది. ధూర్జటి కవితలోని మాధురీమహిమ శ్రీకృష్ణదేవరాయలనూ ఆకర్షించింది కదా!

ఇలా శివభక్తశ్రేణుల్లో అత్యుత్తమునిగా పలువురు కీర్తించిన 'భక్తతిన్నని' కథను విపులంగా చెప్పుకుందాం.

## 4) భక్తతిన్నని జననం

తిన్నడు పుట్టింది ఒకబోయ పల్లెలో. ఆ పల్లెపేరు 'ఉడుమూరు'. ఆ పల్లె దక్షిణ భారతదేశంలో 'పొత్తపినాడు' అని పిలువబడే ప్రాంతంలో ఉండేది. ఇప్పటి శ్రీకాళహస్తి పట్టణం ఉన్నచోటు అప్పటి 'పొత్తపినాడు' లోనిదే. శ్రీకాళహస్తి నుండి శ్రీశైలందాక వ్యాపించిన పొత్తపినాడు లో అడవులెక్కువ. అడవులలో చాల పల్లెలుండేవి. ఆ పల్లెల్లో నివసించేవారు ఎక్కువమంది ఆటవిక జాతుల వారే. ఆ పల్లె లన్నింటిలో 'ఉడుమూరు' అనేది పెద్ద జనాభా ఉన్నగ్రామం. దానికి పెద్ద 'నాథనాథుడు'.

అతడంటే చుట్టుప్రక్కలున్న పల్లెల్లోని వారికంతా గౌరవం; గురికూడ. అందుకే అతడు ఆ ప్రాంతానికంతా నాయకుడు. అతడు 'ఎఱుక' జాతివాడు. ఆ ప్రాంతపు అడవి రాజ్యానికి 'నాథనాథుడే' అప్పటి ఏలిక. ఆ ఎఱుకపెద్ద భార్యపేరు 'తందె'.

పొత్తపినాటిలోనిదే అయిన శ్రీకాళహస్తి పట్టణ పరిసరాలు దట్టమైన అడవులతో కూడినవే. శ్రీకాళహస్తిని ఆనుకొని ఉన్నాయి కైలాసగిరులు. అందులో ప్రకృతి రమణీయమైన సెలయేళ్లూ, జలపాతాలూ, మనోహరమైన కొండచరియలూ ఉన్నాయి. అక్కడక్కడ ఉన్న అడవుల్లోని పల్లెల చుట్టూ కొంతమేర పంట పొలాలు ఉంటాయి. అయితే పల్లెల్లోని ఎఱుకలు ఎక్కువగా, వేటనే జీవనాధారంగా చేపట్టినవారు. అడవుల్లో జీవించేవారంతా నిరుపేదలు కారు. ముఖ్యంగా ఉడుమూరి పరిసరాలు ప్రకృతి రమణీయాలేకాక, విలువైన వస్తుసంపత్తి కలవికూడ. నిద్రలేవగానే ఎఱుకవారి కంటపడేవి, తేటగా జలజల



పారే సెలయేళ్లూ. అద్దాల్లా ప్రకాశించే సరోవరాలూ, అందులో కొల్లలుగా పూచిన ఎఱ్ఱని, తెల్లని తామరపూలూ, కలువలూ వగైరా. అందులో ఈదే నీటికోళ్లూ, బాతులూ, ఎగిరిపడుతుండే మీనాలూ, మరెన్నో జలజంతువులూ. ఎత్తైన ఫలవృక్షాలూ, పలురకాల పూపొదలూ, నెమళ్లూ, పావురాళ్లూ, కౌజులూ, కోయిలలూ, అడవికోళ్లూను. అది యిది అనడ మెందుకు? ప్రకృతి సౌందర్యానికి ఆ పర్వత సానువులూ, పొత్తపినాటి పల్లెపట్టులూ ప్రతినిధులే అనవచ్చు.

ఇక ఆపల్లెలో నివసించే ఆటవికులు ఎలాంటివారంటే దృఢదేహం కలవారు. ఆరోగ్యవంతులు. కపటమెరుగనివారు, వన్య ప్రాణులతో సహజీవనం చేసే 'వననరులు'. వారు వనసంపదను దైవదత్తంగా భావించి, సొంతం చేసుకున్న గొప్ప సంపన్నులు. అయినా జాతి సహజమైన వేషభాషలతో, సాధారణజీవితం గడుపుతుంటారు. వేటనే జీవనాధారంగా చేసుకున్న ఆ చెంచువారు ఒకొక్కసారి ఇల్లువదలి వేటకు వెళ్లితే కొన్ని దినాలూ, వారాలు కూడ తిరిగి యింటికి రారు. వారు తమ గూడేలకు తిరిగి వచ్చేవరకు, ఇంటిలోని సంతానం ఆలనా పాలనా ఆ యింటి ఇల్లాలో, తల్లో, చెల్లెలో, అక్కో చూచుకొనేది. మగవారు విలువైన వేటవస్తువుల్నీ, అడవిలో దొరికే తేనెలూ, నెమలీకలు మొదలు పులిగోళ్లూ, ఏనుగు దంతాల్లాంటి విలువైన వస్తువుల్ని సేకరించి నగరవాసులకు అమ్మి సొమ్ముతెచ్చేవారు. కమ్మని వేటమాంసం అప్పటప్పటికి ఆహారంగానూ తెచ్చేవారు.

మగవారు రావటానికి ఆలస్యమైన సందర్భాల్లో ఆడవారు చుట్టుప్రక్కల పిట్టల్ని కొట్టి వండుకు తినేవారు. అదీ ఒక్కొక్కసారి సాధ్యంకాదు. అప్పుడు గడ్డిగింజల్ని వండుకునేవారు. అవి చాలినన్ని సహజంగా దొరకవు. అందుకని తమగూడేలకు చుట్టూ గడ్డిగింజలు చల్లి పైరుపెట్టేవారు. ఒకవిధంగా ఆలోచిస్తే ఈ పంటపెట్టే పద్ధతి అనాది కాలంలో ఆడవారే కనిపెట్టినారనిపిస్తుంది.

బోయపల్లెల్లోని స్త్రీ పురుషులు సహజంగా లభించే అటవీ సంపదకు సొంతదారులనీ, ఆ విధంగావారు బహుభాగ్యశాలురనీ అనుకున్నాంకదా! వారి

భోగభాగ్యా లెలాంటివో కొంచెం పరిశీలిద్దాం. ముత్యాలూ, ఆణిపూసలూ మనకైతే ఎంతోవిలువైనవి. అడవిలోనే పుట్టిపెరిగే ఎఱుక స్త్రీపురుషులకు అవి పెద్దగా లెక్కలోనికి రానివి. ఎందుకంటే, అవివారికి ముసలి ఏదుపందుల నుంచీ, ఏనుగు కుంభస్థలాల నుంచీ, పండిన వెదుళ్లనుంచీ, అడవి చెఱకుల నుంచీ దొరుకుతాయి. కనుక వాటిని వారు రేగుపండ్లంత చులకనగా చూస్తారట. ఏనుగు తలలనుండి లభించే ముత్యాలను ఉసిరిక కాయల్లా పాటిస్తారట. వెదుళ్లనుండి లభించేవి ఊడిగపండ్లతో సమానమట!

అంతేకాదు. వారు శ్రీగంధపుచెక్కలను, అగరు చెట్లకొమ్మలను పొయిలోకట్టెలుగా వాడుకుంటారు. సంకుమదము, పునుగు, జవ్వాది, కస్తూరి లాంటి సుగంధద్రవ్యాలను వారి ఇంటిమట్టి కుండల్లో నింపుకొని ఉంటారు. తమ యింటి గోడలకు పూయడానికీ, ఇంటిముందు కలయంపి చల్లడానికి కూడ ఆ ద్రవ్యాలను చెంచెతలు ఉపయోగిస్తారు. అలాంటివారి వైభవాన్ని గురించి మనమేమనుకోవాలి? అనంత సంపద కలిగినా, ఆ చెంచుస్త్రీలు తమ ఆచారాలను విడిచి పెట్టరు. పట్టు చీరలు కట్టగల భాగ్యమున్నాసరే, పాఱుటాకులు (పండుటాకులు) వస్త్రాలుగా కట్టుకు తిరుగుతారు. రాజనాల వరిబియ్యం వండుకు తినగలిగినా, అడవిధాన్యాలకూడు వద్దని అనరు. మాణిక్య భూషణాలు ధరించగలిగినా, గురివెంద గింజలు కుట్టి అలంకరించిన బట్టలు ధరించడమే వారికిష్టం. గురివెంద దండల్ని, మణిహారాలంత మక్కువతో ధరిస్తారు. వారి యిళ్లల్లో చందనాది కఱ్ఱల్తో చేసిన మంచాలూ, ఊయెల్లూ ఉంటాయి. కాని, వారికి పూదీగలతో నిర్మించిన మంచెలూ, వ్రేలాడదీసిన ఊయెల లంటేనే యిష్టం.

పైర్లను పాడుచేసే జంతువులనూ, పక్షులనూ భయపెట్టడానికి పొలాల మధ్య, గనిమెలవద్ద కఱ్ఱల్నినాటి, వాటిపై 'సీతమ్మకుండలు' (దిష్టికుండలు) పెట్టడం మామూలే కదా! సున్నంపూసిన కుండకు కనుముక్కులు తీర్చి, నల్లని చుక్కలుపెట్టి, కఱ్ఱకు కాలుచేతులు అమర్చుతారు. అయితే ఆ చెంచులు



నాటే కఱ్ఱలు అగరుచెట్లవి. ఆ బొమ్మ కుండలకు మసిబొట్లకు బదులు 'కస్తురి' బొట్లు పెడతారు. చమరీ మృగాల తోక వెంద్రుకలను, ఆ బొమ్మలకు జుట్టులుగా అమరుస్తారు. ఏనుగు కుంభస్థలం నుంచి తీసిన ముత్యాలను ఆ బొమ్మల కనుగ్రుడ్లుగా ఉంచుతారు. అంతేకాదు, ఏనుగు తలల్నీ, కొమ్ముల్నీ, అడవిదున్నల తలల్ని కొమ్ములతోపాటు తెచ్చికూడ, చేలమధ్యలో దిష్టిబొమ్మలుగా పెడతారట. చేలల్లోకి పందులు దూరకుండ, గట్టులకు 'వలలు' అడ్డంగా కడతారు. ఆ వలల దారాలు మామూలు నారతో అల్లినవికావు. తెల్ల చమరీమృగాల వెంద్రుకలతో పేనిన దారాలతో అల్లినవట.

ఆ పట్టణం పేరు 'ఉడుమూరు' కదా! ఊరు అంటే మరీ పల్లెకాదు. 'పక్కణం' (బోయపల్లె) అని కవే పేర్కొన్నాడు. దాని ఏలిక నాథనాథుడనీ, ఆతని భార్య 'తందె' అనీ ముందే చెప్పుకున్నాం. అడవి రాజ్యంలోని ప్రజలకు ఆ దంపతులు 'పార్వతీ పరమేశ్వరుల్లా' పూజనీయులు. నాథనాథునికి వారు విధేయులేకాదు; 'భక్తులు' కూడ. నాథనాథుడు తన పాలనలోని ప్రజల్ని కన్నతండ్రిలా ఆదరించేవాడు.

## 5) తిన్నని గర్భవాస విశేషాలు.

పరాక్రమవంతుడూ, ప్రజల అభిమానం సంపాదించినవాడూ అయిన 'నాథనాథునికి' 'తందె' లాంటి అనుకూలవతియైన భార్య లభించడం శివుని దయవల్లనే. అమాయకులూ, విద్యాగంధం లేనివారూ అయిన ఆ భిల్లదంపతులకు భక్తిమాత్రం పుష్కలంగా ఉన్నది. అడవిలో వారు పూజించే 'కాటితేడు' ఉన్నాడు. ఏలికతోపాటు పండుగ పబ్బాల్లో, మ్రొక్కుబళ్లు తీర్చుకొనే వేళల్లో ఆ కాట్రేనికి ఎఱుకలంతా కలిసి గొప్పజాతరే జరుపుతారు. వారి భక్తిమార్గం వారిది. నగారాల్లో నాగరికులు తమపద్ధతిలో తాము పూజలూ, ఉత్సవాలూ చేసుకుంటారు. అర్చకులు మంత్రాలూ, పూజలూ, పురస్కారాలూ ఒక తరహాలో ఉంటాయి. మూఢభక్తులూ, ముగ్ధభక్తులూ తాము తినేవి, త్రాగేవి, తాముకొలిచే దేవతలకు నైవేద్యంగా పెడతారు. పుట్టుకే లేని, రూపనిర్దేశమేలేని

దేవుణ్ణి మనకు ఇష్టమైన రూపంలో నిలుపుకొని, అలంకరించుకొని ఆడిపాడి నైవేద్యాలు పెట్టి పూజించుకొంటాము. అలాగే అడవుల్లో పుట్టి పెరిగి అక్కడి జీవాలతో సహజీవనం చేసే 'సహజ మానవులు' అటవీవాసులు. వారి భక్తివిశ్వాసాలు తక్కువేమీకావు. ఏ పూర్వపుణ్యమోకాని 'నాథనాథ తందె'లు జంతుహింసనే జీవనంగా చేసుకుని బ్రతుకుతున్నా, వారిలో దైవభక్తికి కొరతలేదు. ఆ భక్తి పరమేశ్వరుని కృపకు పాత్రమయ్యింది. శివుని కృపతో, 'తందె' కు గొప్పశివధ్యాన సంపన్నుడైన శిశువు గర్భంలో పడ్డాడు.

ఆశ్చర్యకరంగా గర్భిణియైన 'తందె' శరీరాన్ని 'దివ్యకాంతి' అలముకొంది. శివాంశసంభూతుడు, శివభక్తి ప్రపూర్ణుడు అయిన శిశువు కడుపులో ఉండగానే పుట్టబోయే కొడుకు తాను ఎప్పు డెప్పుడు ఈ లోకంలోనికి రానున్నానో, శివుని సేవించనున్నానో అనుకునేవాడట! ఆ నెపంతో, ఆ తల్లికి గర్భవతిగా ఉన్నపుడు అందరి తల్లులకూ కలిగే వింతకోర్కెల నెపంతో, కడుపులోని శిశువుకు శివుని పూజకై వేగిరపడే భావాలే కలిగాయట! సాధారణంగానైతే తల్లికి ఆ సమయంలో కలిగే మనోభావాలు శిశువుమీద పడతాయంటారు. ఇక్కడ శిశువుభావాలతో తల్లి ప్రభావితురాలయ్యింది.

ఆ తల్లికి సింహము, పెద్దపులి, అడవిపందిలాంటి మృగాలను వేటాడాలనిపించేది. పర్వతంచెంత, సెలయేళ్లతీరాన తెల్లగా, స్వచ్ఛంగా చల్లగా ఉన్నయిసుక తిన్నెలమీద దొర్లాలనిపించేది. ఆ చెంతనే ఉన్న శివాలయానికి వెళ్లి శివుని పూజించాలనిపించేది. స్వామిని పుక్కిటి నీటితో తడపాలనిపించేది. రుచిగా ఉండే 'పందిమాంసం' తెచ్చి దేవునికి పెడితే బాగుండు ననుకొనేది. నల్ల కలువల్లాంటి తన కన్నులతో, ముక్కంటిని కొలవాలనుకొనేది. గర్భంలో ఉన్న శిశువు మనసులోని కోర్కెలన్నీ, తందెకు వేవిళ్లనాడు కలిగే కోర్కెల రూపంలో కలిగేవి.

ఈ చర్యలన్నీ తిన్నడు పుట్టాక, స్వయంగా చేశాడు. వేటాడటం, శివలింగ దర్శనం చేయటం, పుక్కిటినీటితో శివుని అభిషేకించటం,



పందిమాంసాన్ని నైవేద్యంగా పెట్టడం, నేత్రం సమర్పించడం ఇవన్నీ తిన్నని జీవితంలో, తరువాతి కాలంలో జరిగాయి. తల్లికి శిశువు మనసులోని కోర్కెలు కలిగాయంటే ఆ శిశువు సామాన్యుడు కాడు. దైవికచిహ్నాలు కలవాడని భావించాలి.

తిన్నడు జన్మించే శుభగడియ రానే వచ్చింది. శిశువు శివభక్తిని ముందుంచుకొని పుట్టాడట. సంసార మోహాన్ని తెగగోసినట్టుగా మంత్రసానులు పాపని బొడ్డుకోశారట. ఆ పుట్టినవాడు శివభక్తి పరుడని తెలిపేలా నుదుట విభూతి రేఖలు దిద్దారట. పిల్లాడికి పురిటినీళ్లు పోయడం, పాపమనే బురదను కడిగివేసి, పరిశుద్ధుణ్ణి చేసినట్టున్నదట! బిడ్డకు పట్టించిన ఉగ్గు (చిత్సుధారసము) జ్ఞానమనే అమృతాన్ని త్రాగించినట్టున్నదట! ప్రముఖులైన జ్ఞానులు పుట్టిన కొన్నాళ్లదాక కళ్లుతెరవకుండ, ఏడవకుండ, జ్ఞానముద్రలో ఉండినట్టు మనం పూర్వగ్రంథాల్లో చదివాం.

## 6) శిశుదశలో తిన్నని వింతప్రవర్తన.

ఇక్కడ తిన్నడూ అదే విధంగా ఉన్నాడట. ఆ బుడుత జ్ఞానాంబిక భర్త పాదధ్యానంలో మునిగి, నిద్రలో ఉన్నట్టు కొన్నాళ్లు మౌనంగా కళ్లుతెరువకనే ఉన్నాడట. ఆ తరువాత ఈ లోకం తీరు ఎలాగున్నదో చూద్దామన్నట్టు కళ్లుతెరచాడట.

పుట్టిన కులము ఏదైతేనేమి? 'ఇది అపూర్వజ్ఞాన సంపన్నుని జననము' అని తెలిపే ఉదంతమే. శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో ధూర్జటి కవి తిన్ననిజననం మొదలు బాల్యం వరకు వర్ణించిన తీరు ప్రత్యేకంగా గమనింపదగినది. భగవంతుని దృష్టిలో భక్తే ప్రధానం. కులం, వర్ణం, పుట్టుక, జీవించేపద్ధతి, మొదలైనవి ముఖ్యం కాదని కవి స్పష్టంచేశాడు. పూర్వజన్మ వాసనలే శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో వచ్చే భక్తులందరినీ శాసిస్తున్నట్టు తెలుస్తున్నది. గ్రంథంలోని ఇతర భక్తుల్లో తిన్నడూ ఒక్కడు. కాని, ఇతనిలో ప్రత్యేకత లున్నాయి. పొత్తిళ్లలో

ఉన్నప్పటి శిశువు చేష్టల నుండి, బాలుడై, యువకుడై ప్రవర్తించిన ప్రతిచేష్టా, కదలికా తిన్నని శివభావనా విశేషాలను ధూర్జటి కవి వర్ణించిన తీరు మధురమనోజ్ఞంగా ఉన్నది.

సహజమైన శిశువు చేతలు శివయోగి చేతల్ని తలపిస్తున్నవట. పిల్లవాని నవ్వుఎలాగున్నది? 'ఈ లోకం శివభక్తి లేకుండ ఎంత చెడిపోయింది' అన్నట్టున్నదట. పాదాలు పైకెత్తి, గాలిలో ఆడిస్తూ, కిందమోపుతుంటే 'మోహబంధాన్ని' తెగతన్నినట్టు అనిపిస్తున్నదట. పొత్తుల పరుపుమీద బోర్లపడి దొర్లటం, 'సత్త్వగుణం' కలిగినందువల్ల, జన్మరాహిత్యంకోసం కొట్టుకు లాడుతున్నట్టనిపిస్తుంది.

బోర్లపడినబిడ్డ, మరికొన్నాళ్లకు కూర్చోగలిగాడు. ఆ కూర్చోవటం 'శ్రేయోరాజ్య సింహాసనం' మీద కూర్చొన్నట్లుంది. ఆపై కొన్నాళ్లకు బిడ్డడు జరుగుతూ, కూర్చొని ముందుకు సాగడం ప్రారంభించాడు! అప్పుడా శిశువు తడుములాడుతూ, జరుగుతూ, చేతులు నేలమీద చరుస్తూ, ఏదోపోయిన దానికోసం వెదుకుతున్నట్టు ఆడుకొనేవాడు తిన్నడు. అప్పుడు ఆతని కదలికల్నిచూస్తే, ఏమనిపించేదో తెలుసా? భూమిపై 'శివతత్త్వాన్ని' వెదకి పట్టుకొనే ప్రయత్నం చేస్తున్నట్టుండేది. అతడు లేచి తప్పటడుగులు వేస్తుంటే, లోకం నిండా నిండివున్న శివుణ్ణి, పట్టుకోవడానికీ, ముట్టుకోవడానికి, సందేహిస్తూ భయపడుతూ అడుగులు ముందు కేస్తున్నాడా అని అనిపించేది.

ఇలా ఒక ఆటవిక ప్రభుని ఇంట్లో, ఎంతో బుద్ధిమంతునిగా, బాలభక్తునిగా, సున్నిత మనస్కుడుగా, శివభక్తితో కూడిన ఆటపాటల్లోనే ఆనందం పొందుతున్న బాలుణ్ణి చూచిన వారంతా 'ఆహా! ఈ పిల్లవాడు ఎంత నెమ్మది వాడు'. ఈతని కన్న మన ఏలిక ఎంత అదృష్టవంతుడు! గొప్పింటివారి పిల్లలకు సహజంగా ఉండే గర్వంకానీ, పొగరుబోతుతనంకానీ, వీనిలో మచ్చుకైనా కనిపించవుకదా! అనుకునేవారు. ఆతని నెమ్మది గుణం, అతని తల్లిదండ్రులకెంతో సంతోషాన్ని కలిగించేది. కనుకనే ఆ బాలునికి 'తిన్నడు' అనిపేరు పెట్టుకున్నారు.



బాలుని స్వభావం ఎరిగిన వారంతా పిల్లవానికి తగినపేరు, చక్కని పేరు కుదిరిందని సంతోషించారు.

## 7) తిన్నని బాల్యక్రీడలు:

ఆడుకునే వయసు వచ్చింది తిన్ననికి. తనయీడు బాలురతో కూడి ఎన్నోరకాల ఆటలు ఆడుకునేవాడు. ఆనాటి ఆటల్లో ఇప్పటి వారికి తెలియనివి ఎన్నోవున్నాయి. చిట్లపొట్లకాయ, సిరి సింగణావత్తి (బాలురు గుండ్రంగా కూర్చొని ఉన్నపుడు ఒకబాలుడు వస్త్రాన్నొకదానిని దారంలా పేనుతాడు. దాన్ని వత్తి అంటారు. ఆ వత్తిని తన వెనుక భాగంలో దాచుకొని, గుండ్రంగా కూర్చొని ఉన్న బాలుర వెనుక 'వత్తి,వత్తి' అని పలుకుతూ తిరుగుతుంటాడు. హఠాత్తుగా తనవెనుకదాచిన వస్త్రపు తిరిని, ఏ బాలుని వెనుకనో పడవేస్తాడు. అలా పడవేశాక మరొకసారి బాలుర గుండ్రపు బంతి (పంక్తి) ని చుట్టివస్తాడు. ఈ లోపున ఎవరివెనుక 'తిరి' జారిపడి ఉన్నదో, ఆ బాలుడు తెలుసుకుంటే, ఆ తిరిని చేతబట్టుకొని, తిరిని జారవిడిచిన బాలుని వెంటబడి వీపున మోదుతూ తరుముతాడు. దెబ్బలు తింటున్నబాలుడు, దెబ్బలేస్తున్న బాలుడు కూర్చున్నచోటి కెళ్లి కూర్చుంటాడు, అంతే! ఆపై రెండవ బాలుడు మొదటి బాలుడు ఆడిన ఆటను ఆడుతాడు. ఇప్పటికీ పల్లెలో 'వత్తివత్తి ఆట' గా పిలుస్తూ ఆడుతుంటారు. దీన్నే 'తిర్రాట' అనీ అంటారు. గుడుగుడుగుంచం,'గుండేరాగం' అంటూ పాడుతూ ఆడేఆట వెన్నెలకుప్పలు. ఇవి వెన్నెలరాత్రుల్లో రెండుజట్ల పిల్లలు ఆడుకునే ఆట.

ఒకజట్టు వీధిసందుల్లో ఇండ్లఅరుగుల మీదనో, గవాక్షాలవద్దనో, గోడల గూళ్లూ మొదలైన చోట్లకు వెళ్లి, వీధిలో దొరికే మెత్తటి ఇసుకను తీసుకొని చిన్నచిన్న కుప్పల వరుసల్ని తీరుస్తారు. రెండవ జట్టువెళ్లి వాటిని కనిపెట్టి కుప్పల్ని తుడిచివేస్తూ లెక్కపెడతారు. ఆపై మొదటి జట్టు కుప్పల్ని పెడతారు. ఎక్కువ పెట్టిన జట్టు గెలుస్తుంది. ఇదే వెన్నెల కుప్పలాట. తన్నుబిల్లాట. దీన్నే 'తొక్కుడుబిల్లాట' అంటారు. 'తూరన తుంకాలు' దీనివిషయం తెలియదు.

'గీరనగింజలు' అనేది ఒకక్రీడ. దీనివిషయమూ ఇప్పటి వారికి స్పష్టంగా తెలియదు. పైరెండూ ఒకవేళ 'వామనగుంటలు' గా పిలువబడే క్రీడావిశేషాలయి వుండవచ్చు. ఒక చెక్క పలకపై గుంటలు చేయించి, అందులో చింతపిక్కలు పెట్టి ఆడే ఆటను మనం 'వామనగుంటలు' లేక 'ఓమన గుంటలు' అంటాము. 'బిల్లగోడు' ఆట తెలిసిందే. 'చెండాట' దీన్నే 'బంతాట' అంటాము. 'ఉప్పన పట్టెలు' ఇవి ప్రసిద్ధమే. 'చిక్కనా బిళ్ల' లోటిళ్లు లాంటి ఎన్నో ఆటలు. ఆ కిరాత బాలురు ఆడుకునేవారు. తనయీడు బాలురతో ఇలాంటి అనేకమైన ఆటలాడుకొంటూ తిన్నడు బాల్యాన్ని ఆనందంగా గడిపాడు.

కాలం గడుస్తున్నది. తిన్నడు పెరిగి మరికొంత పెద్దవాడయ్యాడు. అతడు ఆడుకొనే ఆటలూ మారాయి. శబర కుమారులకు 'వేటే వృత్తి'. అందుచేత వారికి వేటాడటం కూడ ఒక ఆటే. అదేవారికి సరదాకూడ. తిన్ననికి చిన్నప్పటి నుంచే 'వేట'లో మంచి నైపుణ్యం అబ్బింది. తనయీడు వారితోనేకాక తన కంటే పెద్దవారితో కూడ వేటకు కలిసి వెళ్లేవాడు. వారు ఉపయోగించే వేట సామగ్రితో, రకరకాల ఆటలాడేవాడు. పెద్దవారి మెప్పుపొందే వాడు. ఈటెలు, రకరకాల విండ్లూ, బాణాలూ, వలలూ లాంటి పరికరాలు తీసుకొని ఉత్సాహంగా వేటకు వెళ్లేవాడు. అడవిలో కుందేళ్లూ, జింకల్లాంటి సాధుజంతువుల్ని పట్టి తెచ్చేవాడు. పందులూ, దున్నలూ, చిరుతలూ, తోడేళ్లలాంటి వాటిని నేర్పుగా తన చేతనున్న చిన్నచిన్న ఆయుధాలతోనే మట్టుపెట్టేవాడు. ఆతనికి ఆ వయసులో అబ్బిన నేర్పును చూచిన చిన్నా పెద్దలు "వీడు దేవుడి పాలయ్యేలా ఉన్నాడు. లేకపోతే ఇంతప్పుడే వేటలో ఇంత సామర్థ్యం ఏలా అబ్బుతుంది" అనుకునేవారు.

ఆ పిన్న వయసులోనే పరుగెత్తే లేళ్లనూ, ఆకాశంలో ఎగిరే పక్షులనూ, తన చేతి చిన్నవింటితోనే గురి తప్పకుండ కొట్టేవాడు. విల్లు పట్టిన నెల, పదినాళ్లలో తడవిల్లు, (తడ కర్రతో చేసినది) వెదురు విల్లు, సెలసు విల్లు లాంటి రకరకాల విండ్లను ఉపయోగించే నేర్పు సంపాదించాడు. మహాభారతంతో ఏకలవ్యుడు సొంతంగా విలువిద్యానైపుణ్యం సంపాదించినట్టు తిన్నడు సొంతంగానే అభ్యాసం చేసి విలువిద్యలో గొప్పవాడయ్యాడు.



## 8) తిన్నని విలువిద్యారంభోత్సవం:

అప్పటికింకా అక్షరాభ్యాసంలాంటి విలు విద్యాభ్యాసం పండుగను నాథనాథుడు జరిపించలేదు. పూర్వజన్మ వాసనాబలంతో, సహజంగా అబ్బిన విద్య ఎంతున్నా, గురుముఖంగా అభ్యసించి ప్రయోగించ గలిగేదే అసలు సిసలైన విద్య. అందులోనే పరిపూర్ణత ఉంటుంది. అందుకే ఒకశుభముహూర్తాన చెంచుల కులదైవమైన 'కాటిఱేని' సముఖంలో తిన్ననికి వారి కులవిద్యయైన 'విలువిద్య'ను అభ్యసింపజేయడానికి ఒకజాతర ఏర్పాటుచేశారు. మనం మనపిల్లలకు చేయించే 'అక్షరాభ్యాస మహోత్సవం' లాంటిది ఆ జాతర. ఆ జాతర ఎంతో సందడిగా జరిగింది. చెంచుగూడేల్లోని పిల్లా జెల్లా, ముసలీ–ముతకా, ఆడా–మగా ఇంకా కుఱ్ఱజంటలు, ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తప్పెట్లూ, సొరబుఱ్ఱలూ, కిన్నరవీణలూ, కొమ్ములూ, గుమ్మెటలు లాంటి ఎన్నోరకాల వాద్యాల మ్రోతతో అడవంతా మారుమ్రోగింది. పొంగళ్లూ, వేటబలులూ, పాటలూ, చిందులూ, త్రాగుడూ–తడబాట్లతో గోలగోలగా సాగింది జాతర.

తిన్నని తలిదండ్రులు ఆనాడు ఉపవాసం ఉన్నారు. తమ జాతివారు చేసుకునే అలంకారాలు తాము చేసుకుని పూజకు సిద్ధమయ్యారు. సేవకులను పంపి తిన్నని కూడ చక్కగా అలంకరించి, కాటిరేని వద్దకు పూజకోసం తీసుకురమ్మన్నారు. వారు వెళ్లి బాలుని పన్నీటితో స్నానం చేయించారు. విభూతి రేఖలు ఒంటిమీదనూ, నుదుటి మీదనూ చక్కగ దిద్దారు. రక్షకోసం తాయెతుల్లో మూలికలు నింపి బాలునికి కట్టారు. తలదువ్వి, వెండ్రుకలను పాయలుగాతీసి పైకిలేపి తీగలతో చుట్టికట్టారు. చక్కగా అలంకరించిన విల్లునొకదానిని అతనిచేతి కిచ్చారు. అమ్ముల పొదిని వీపున వ్రేలాడేటట్టుకట్టారు. ఈకలు కూర్చిన తలకట్టూ, మొలచుట్టూ పులిచర్మం, దానిపై ఒక చర్మపుదట్టీ కట్టారు. చక్కగా అలంకరింపబడ్డ బాలుని వారి దేవుని వద్దకు నడిపించుకు వచ్చారు.

ఆతని విద్యాభ్యాసం వేటాడే అనేక రకాల విద్యల్లో. అందులో ఆయుధాలు ఎన్నో రకాలవి ప్రయోగించాలి. విల్లూ, ఖడ్గమూ, ఈటె, వల.,

ఇలా వివిధ మార్గాల్లో వివిధ పశు పక్షి జంతువులను వేటాడాలి. అందులోని మెలకువలను అనుభవం కలిగిన పెద్దవేటగాండ్రు పిన్నలకు నేర్పుతారు. అలాంటి క్రూరవిద్యను తిన్ననికి నేర్పబోతున్నారు. అయినా తిన్నని వేషంలో శివభక్తుడే కనిపిస్తున్నాడు. అది దైవ నిర్ణయం. అది అతని భవిష్యత్తుకు గుర్తు.

ఎఱుక పెద్ద తనకొడుకు విలువిద్యాభ్యాస ప్రారంభపూజకోసం దప్పు (దండోరా) వేయించాడు. మొదటి దండోరాతో మన్యవాసులంతా జాతరకు వెళ్లడానికి తమతమ ఏర్పాట్లు చేసుకున్నారు. రెండవనాడు దప్పుకొట్టి ప్రకటించారు. ఆ దినం మంగళవారం. బోయపల్లె వాసులంతా జాతరకు బయలుదేరారు. ఆ బయలుదేరిన వారు తమ కులదైవంగా పూజించే శివస్వరూపుడైన కాటిరేనికి సమర్పించుకోవడానికి వండివార్చినవీ, సేకరించి తెచ్చినవీ అయిన రకరకాల నైవేద్య పదార్థాలు నాగరికులు తమదైవాలకు సమర్పించుకొనే భక్ష్య భోజ్య, పానీయాల కంటే ఎంతో శ్రద్ధతో చేసినవి.

కిరాతకాంతలు ఎంతో సహజంగా అలంకరించుకొని జాతరకు బయలు దేరారు. చెంచు కాంతలైనా వారు సుందరీమణులే. అర్ధచంద్రుని పోలినవారి నుదుట వంకర్లు తిరిగిన నల్లని ముంగురులు కదలాడుతున్నాయి. ఆ ముంగురుల మధ్య వారు దిద్దుకొన్న పెద్దజేగురురంగు నుదుటి బొట్టు తళతళ మెరుస్తూ మనోహరంగా కనిపిస్తున్నది. వక్షస్థలాన తామరతూండ్లు ధరించారు. భుజాలకు నెమలి పురిదండలూ, చెవులకు నెమలి రెక్కలూ కట్టుకున్నారు. తలలో ఎఱ్ఱగోరింట పూలు పెట్టుకున్నారు. పాదాలకు పారాణి పూసుకున్నారు. చురుకు చూపుల కళ్లకు కాటుక దిద్దుకున్నారు. కస్తూరి, జవ్వాది అలదుకొన్నారు. అడవి పసుపుపూసుకొని జలకమాడి నందువల్ల వారిశరీరం నుండి సుగంధ పరిమళాలు వెలువడుతున్నాయి.

ఆ సుందరాంగులు తమదైవానికి సమర్పించుకోవడానికి, తమ ఏలిక కొడుకు విద్యాభ్యాసం నిర్విఘ్నంగా కొనసాగాలని ప్రార్థించడానికి రకరకాల నైవేద్య పదార్థాలు తయారు చేసి వెంటతెచ్చారు. పువ్వులా వండివార్చిన నివ్వరి



బియ్యపు కుండలు తెచ్చారు. చమరీ మృగాల పాలతో కలిపిన గునుగు బియ్యపు పాయసం పాత్రలతో వచ్చారు. వెదురు బియ్యపు పిండితో నేర్పుగా వండిన కుడుములు తీసుకువచ్చారు. నేలగుమ్మడికాయ ముక్కలువేసి, వెల్లుల్లి వాసన గుబాళించేటట్టూ పిండికూరలు చేసి చట్లలో నింపుకొని వచ్చారు. పచ్చదనం కమలకుండ అడవి ఆకుకూరలను తాళింపుచేసి తెచ్చారు. పలురకాల మాంసపు అటికలు తెచ్చారు. ద్రాక్ష, బెల్లము, ఇప్ప, తాటి, గిరకతాటి నుండీ, బియ్యం నుండీ తయారు చేసి వెలికి తీసిన 'మద్యపు' కుండల్ని తమ భర్తలతో కలిసి వెదురు గంపల్లో, కావడుల్లో తీసుకొచ్చారు. అడవిపందులు, అడవికోళ్లు, అడవిదున్నలు, అడవిమేకలు, గొఱ్ఱెలు మొదలైన జంతువుల్ని పట్టుకొని బండ్లు కట్టుకొని కాట్రేని పూజకు ఆటవిక యువతీ యువకులు సందడి చేస్తూ బయలు దేరారు. ఉత్సాహంతో అప్పుడు వారు చేసిన తప్పెటధ్వనులూ, కిన్నరవీణా (సొరబుర్ర వీణ) స్వనాలూ, కేకలతో కూడిన కిరాతుల ఉత్సాహగానాలూ, గుమ్మెట వాయింపులూ ఆ వనభూమిలో గొప్పసందడిని నింపాయి.

పూజకు బయలు దేరిన తిన్నని తల్లిదండ్రులు కూడ తమ కుమారుని అలంకారాన్ని చూచి, తాము అలంకరించుకున్నారట! ఎలాగ? స్నానం చేసిన తిన్నడు ఒంటికి విభూతి రాసుకున్నాడు. మూలికలతో కూడిన రక్షాబంధనాలు కట్టుకున్నాడు. పూలదండల్ని కడియాల్లా చుట్టుకున్నాడు. కాసెకోక కట్టుకున్నాడు. తలవెండ్రుకల్ని లేతతీగలతో చుట్టికట్టుకున్నాడు. చేతవిల్లు, అమ్ములు ధరించాడు పూజకు బయలు దేరేటప్పుడు. నాథనాథుడు కూడ అచ్చం అలాగే అలంకరించుకొని, తనభార్యతో పాటు పూజకు బయలుదేరాడు.

అప్పటికే కాట్రేని ముందు బోయల సమూహము చేరి తమ ఏలిక, అతని కొడుకుకోసం ఎదురుచూస్తున్నారు తిన్నడు తన 'అమ్మ నాన్నలతో కలిసి వెళ్లి పూజలో పాల్గొన్నాడు. ధనుర్బాణాలూ, బరిసెలూ, వలలూ, వేటకొడవళ్లూ మొదలైన ఆయుధాలు వారిదేవుని ముందుంచారు. ఎఱ్ఱని పూలదండలు, ఎఱ్ఱని చందనం మొదలైన వానితో దేవుని అలంకరించి ఉండగా,

నైవేద్యానికి తెచ్చిన పాయసం, కుడుములు మొదలైన పాత్రలు, గంపలు వరుసలుగా తీర్చి అమర్చి ఉండగా గుగ్గిలపు పొగవేశారు. రకరకాల దీపాలు త్రిప్పారు, తట్టుపునుగు, జవ్వాది లాంటి సువాసన ద్రవ్యాలు దేవునికి పులిమి ఉన్నందువలన ఆ ప్రాంతమంతా గుబాళిస్తోంది! ఉత్సాహభరితంగా చెంచుల లయతో పాటలు పాడుతూ, కాత్రేనికి ప్రదక్షిణలు చేశారు అందరూ కలిసి. అటుపై ఆటవిక జంతువులను బలిపెట్టారు. తరువాత అంతా కలిసి నీళ్లుతాగి ఉపవాసం ముగించి, కలిసి విందారగించారు. ఆ విందులో మద్యం తాగడం వల్ల జాతరలో పాల్గొనడానికి వచ్చిన గూడెంలోని శబరదంపతులు, తాగినవారు చేసే ఆగడాలన్నీ చేశారు. అదీవారి ఐకమత్యానికీ, స్వామిభక్తికీ, ఆనందానికీ, ఆనవాలే! అలా పూజ ముగిసింది.

## 9) తిన్నడు వేటకు వెళ్లిన విశేషాలు:

జాతర ముగిసిన మరునాడే తిన్నడు పరివారంతో వేటకు బయలు దేరాడు. కొన్నిదినాలు కొనసాగే వేట అది. వేటలు రకరకాలు. ఆయా వేటలకు కావలసిన సామగ్రి వెంట తీసుకుపోవాలి. తెరచీర కట్టలు, పోగుచుట్టలు, దొడ్డివలలు, ఏటివలలు, కుందేటి వలలు, ఎలిక వలలు ఇలా ఎన్నోరకాల వలల్ని పోగుచేసుకున్నారు. సివంగులూ, కుక్కలూ, కృష్ణజింకలూ, ముంగిసలూ, ఎద్దులూ మొదలైన మచ్చిక జంతువుల్ని వెంటబెట్టుకున్నారు. ఎందుకంటే వాటిని ఎరచూపి ఆయాజాతి జంతువులను పట్టుకోవడానికి! విడివేటకు కావలసిని ఓరణాలు, సెలకట్టెలు, సాళువ పక్షులు, కంచర గాడిదలు మొదలైన వానిని వెంటబెట్టుకున్నారు. 'పాదివేట' కోసం, పూరేడు, కారుకోడి, కౌజు, కక్కెర, చిందరల్లాంటి పక్షులను జతచేసుకున్నారు. ఉరులు, ఉరికర్రలు, బోనులు, చిక్కాలు, జిగురు గండెలు, తీపుత్రాళ్లు, ఒడిత్రాళ్లు, తలముళ్లూ పోగేసుకున్నారు. ఇంకను ఈటెలు, బరిసెలు, విండ్లు, బాణాలు, కత్తులు, కటార్లు వగైరా సామగ్రి తీసుకుని వేటకోసం మొదట వేంకటాచలం అడవుల వైపుబయలుదేరి వెళ్లారు.



తిన్ననివెంట అతనియీడు యువకులు చాలమంది వచ్చారు. వారు తమకు ఇష్టమైన వేటలకోసం జట్లుజట్లుగా విడిపోయి అడవిలో వారివారికి తగిన వేటజంతువులు దొరికే ప్రాంతాలకు చీలిపోయారు. ఒక్కొక్క జట్టువెంటా అనుభవం కలిగిన ఒకరిద్దరు వేటగాండ్రు వెళ్లారు. ఎవరు ఏ ప్రాంతంలో వేటాడినా ఏ జంతువుల్ని వేటాడినా ప్రొద్దుక్రుంకే సమయానికి అందరూ ఒక్కచోట తమతమ వేట జంతువులతో చేరాలనేది నియమం. అలా చేరినవారు పక్వంగా కాల్చిన మంసపుముక్కల్ని తినగలిగినంత తింటారు. మిగిలిన జంతువులనూ, తినదగినవైతే, తోలుతీసి, ఈకలుపీకి, చెడిపోకుండ ఎర్రమన్ను పూయడమో, దోరగా కాల్చి దొన్నెల్లో భద్రపరచడమో చేసి అనాటికానాడు తమ జట్లలోని వారిద్వారా పట్టణంలోని పెద్దలకు చేర్చమని పంపేవారు. క్రూరజంతువులవైతే గోళ్లూ, చర్మాలూ తీసి అమ్మకానికి తగినట్టు చేసి పంపేవారు.

అలా వేటాడే ఉడుమూరి చెంచు కుర్రాళ్లు అందరూ ఒకయెత్తైతే, తిన్నడొక్కడే ఒకయెత్తు. ఎవ్వరూ నేర్పక ముందే అతనికి అన్నివిద్యలూ వచ్చేశాయి. ఒకనాడేమో వేటకెళ్తాడు. ఉగ్రమృగాలను పడగొడ్తాడు. జింకల నొకనాడు వెంటబడి పట్టుకొస్తాడు. మరొకదినం రకరకాల పక్షులను పట్టి పంజరాల్లో బంధిస్తాడు. మచ్చిక చేసినడేగతో వెళ్లి వివిధరకాల పక్షులను పట్టుకుతెస్తాడు. ఇలా 'తిన్నడు' ముంగివేట, ఏదువేట, సివంగి వేట, గంటవేట, ఎద్దుచాటున వెళ్లే విడివేట లాంటివి నేర్పుతో నిర్వహిస్తాడు. ఆయా వేట విధానాల్లో చక్కని నేర్పు గడించాడు. మెలకువలు తెలుసుకున్నాడు.

'గంటవేట' అంటే గంటవాయిస్తున్నపుడు ఆ గంటశబ్దానికి కుందేళ్లలాంటి సాధుజంతువులు బెదరి పరుగుతీస్తాయి. ఆ జంతువులు పరుగు తీసేదిక్కు ముందుగా తెలుసుకొని మరొకదిక్కునుండి గంట శబ్దాన్ని వినిపించడం వేటవ్యూహం. అలాపరుగు తీసిన జంతువులు, వాటి దారిలో ముందే పన్నిన వలల్లో చిక్కుకుని వేటగాండ్రకు చిక్కుతాయి. ఎద్దువేటలో వేటగాడు ఎద్దుమరుగున నక్కుతూ వెళ్ళుతాడు. ఆ యెద్దు వేటగాని సైగతో

ఉరులో, వలలో పన్నిన వైపునకు నడుస్తుంది. అక్కడ 'ఎర' తింటున్న వాటినో, ఉరుల్లో తగులుకొన్న ప్రాణులనో పట్టుకుంటాడు వేటకాడు. దీన్నే విడివేట అనికూడ అంటారు.

అలా తిన్నడు చిన్నా-పెద్ద, సాధువు-క్రూర జంతువుల్ని ఎన్నింటినో పట్టుకున్నాడు. అందులో జింకలు, దున్నలు, కణుతులు, కొర్నవగండ్లు, ఎలుగుబంట్లు, చమరీ మృగాలు, పునుగు పిల్లులూ, కస్తూరి మృగాలు మొదలైన వాటిని, ఏ దినానికి ఆ దినం తనపరివారం ద్వారా పట్టణంలోని తన తండ్రికి కానుకగా పంపుతున్నాడు. మిగిలిన వాటిలో మృగ, పక్షి మాంసాదుల్ని పక్వంగా చేసి స్నేహితులతో కలిసి ఒకచోట చేరి తిని ఆనందిస్తున్నాడు. అలాసాగిన వారివేట వేంకటాచలం అడవులనుండి అగస్త్య పర్వత ప్రాంతానికి సాగింది. ఆపైన 'అంజికొండ', సదాశివకోన, ఆపై దక్షిణ కైలాస గిరుల ప్రాంతం దాక సాగింది.

## 10) తిన్ననికి శివుడు కలలో కనిపించి చేసిన సూచన:

కారణజన్ముడైన తిన్నడు కిరాత జాతిలో పుట్టాడు. వంశవృత్తి వేటలో మొనగాడైనాడు. కులదైవానికి మ్రొక్కి పరివారంతో కలసి తొలిసారిగా పలు అరణ్యాలలో వేటాడటానికి వచ్చాడు. వెంటవచ్చిన స్నేహితులూ, పెద్దలూ, పరివారమూ అడవిలో వేరువేరు మార్గాల్లో వెళ్లారు. ఉత్సాహవంతుడైన తిన్నడు జంతువుల వెంటబడి ఒంటరిగా చాలదూరం వెళ్లిపోయాడు. అలసట వచ్చింది, అతనికొక చక్కని పొగడ చెట్టు కనిపించగా దాని నీడకు చేరాడు. చల్లని ఆ చెట్టు నీడలో సేదతేరాలని కూర్చున్నాడు. అంతే నిద్రముంచుకు రాగా నేలమీద పండుకొన్నాడు. గాఢనిద్ర పట్టేసింది. ఆ నిద్రలో ఒక చిత్రమైన కలవచ్చింది. ఏమిటా కల?

ఒళ్లంతా తెల్లగా విభూతి పూసుకొని పులితోలుతో చేసిన మొలదట్టీ కట్టుకొని, పిడచలుకట్టి ఎర్రబారి ఉన్న జడల జుట్టుకల ఒక జంగమరూపుడు



కలలో తిన్నగా 'తిన్నని' సమీపించాడు. అతని మూపున మొండెముల దండ ఉన్నది. కంఠాన 'శివలింగం' వ్రేలాడుతున్నది. అతని లోచూపులు 'గొప్పయోగి' అని సూచిస్తున్నాయి. అలా సమీపించిన శివయోగి తిన్ననితో ఇలాగన్నాడు.

"ఓ బాలుడా! ఈ సమీపంలో 'సువర్ణముఖరి' అనే నది ఉన్నది. ఆ నదిగట్టున ఒక కలుజువ్వి చెట్టున్నది. దానినీడలో పార్వతీపతి పరమశివు డున్నాడు. నీవు వెళ్లి ఆ స్వామిని భక్తితో సేవించు. నీకు మేలు జరుగుతుంది." అని చెప్పాడు. అత డెవరో తిన్ననికి తెలియరాలేదు. గురువో! దైవమో! తనకు అర్థంకాలేదు. అలాంటి రూపాన్ని అతడు ముందెప్పుడూ చూచివుండ లేదు. ఆ వ్యక్తి తిన్నడిని ఒడిలో పడుకోబెట్టుకున్నాడు. నుదుట విభూతి పూశాడు. తనవెంట తెచ్చిన 'శివతీర్థం' త్రాగించాడు. ఆతణ్ణి 'కన్నప్పా!' అని ప్రేమతో పిలిచి బుగ్గలు నిమిరాడు. "వెళ్లు కన్నప్పా! దగ్గర్లోనే నేను చెప్పిన 'శివలింగం' నీకు కనిపిస్తుంది. అదే నీ ప్రాణలింగం." అని బోధించాడు. మరుక్షణమే ఆ యోగి మాయమయ్యాడు.

'తిన్నడు' అని మనం పిలిచే భక్తుడ్ని కలలోని శివుడే 'కన్నప్పా!' అని పిలిచాడు ముద్దుగా. ఇక మనమూ ఈ ముగ్ధభక్తుడ్ని పై రెండు పేర్లూ పెట్టి పిలుచుకుందాం.

బాలుని కల కరగి పోయింది. తిన్నడు దిగ్గన మేల్కొన్నాడు. కలతాలూకు దివ్యానుభూతి అతడ్ని ఆవరించే ఉన్నది. ఇది కలా? లేక నిజమా? అనే సందిగ్ధంలో కాసేపున్నాడు.

'ఇది కలే! లేకపోతే ఆ జంగము దేవర ఇప్పుడు నాముందుండాలి కదా! ఎంతోసేపు కాలేదు. ఇప్పుడే నే నాతని ఒడిలో పడుకొని ఉండిలేచింది! ఇంతలో ఆయన ఎక్కడికి పోయివుంటాడు? అనుకొని తన నొసలు తడుముకున్నాడు. ఆశ్చర్యంగా అతనికి కలలోని యోగి తన నుదుట పూసిన విభూతి తన చేతికంటుకొని వచ్చింది. ఆ విభూతి పరిమళం గుండెదాక వెళ్లింది. అంతేకాదు. ఆ మహాత్ముడు 'నీముందొక దారి ఉంది. దానివెంటవెళ్లు'

దగ్గర్లోనే నేను చెప్పిన 'ప్రాణలింగం' అగుపిస్తుంది అన్నాడు. తాను నిద్రపోకముందు, ఆ చెట్టు క్రింద కూర్చున్నప్పుడు, తనకు కనిపించిన కొత్త నడక మార్గమొకటి తిన్ననికి కొట్టవచ్చినట్టు కనిపించింది. అదీ ఆశ్చర్యమే! ఈ వింతేదో ఈ కొత్తమార్గంలో వెళ్ళిచూస్తే తెలిసిపోతుందికదా! అతడే నిన్ను ఉద్ధరించే దేవుడు! నీ ప్రాణలింగమైనవాడు' అని చెప్పిన తీయని పలుకులే చెవిలో మరలమరల ప్రతిధ్వనిస్తున్నాయి. నిజం తెలుసుకుందామనే కుతూహలంతో కన్నప్ప కొత్తకాలి బాటగుండా కదిలాడు. కొంత దూరం వెళ్లేసరికి కలలోని స్వామి చెప్పిన అద్భుత శివలింగం తిన్ననికి కనిపించింది. కర్పూరంలా మెరిసిపోతున్న లింగం! రుద్రాక్షలా ప్రకాశిస్తున్నలింగం! తలపై సర్పశిరస్సులున్న లింగం! పానవట్టంపైన నున్నగా, గుండ్రంగా, సాధారణ శివలింగాలుంటాయి. ఈ లింగరూపం వేరుగా ఉన్నది. సన్నగా, గుండ్రంగా పైకిలేచిలేదు. తరులు తీరి, నొక్కులు నిలువుగా, చక్కగా తీరి ఉన్నాయి.

తిన్ననికి కలరావడం, ఆ తిన్నడు ఒంటరిగా వేటలాడుతూ వెళ్లి, అంజి కోననుండి సదాశివకోనకూ, అక్కడి నుండి శ్రీకాళహస్తి సమీపంలోని కైలాసగిరులకూ వేటాడుతూ వెళ్లి అలసిపోయి ఒక చెట్టుక్రింద నిద్రించడం. పాల్కురికి సోమనాథకవి బసవపురాణంలోను ఆతని తర్వాత సుమారు మూడుశతాబ్దాల తర్వాత వచ్చిన ధూర్జటి కవి శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోనూ ఒకేవిధంగా ఉన్నది. అయితే ధూర్జటి తిన్నడు ఒంటరిగా వేటాడుతూ చాలదూరం వెళ్లడానికీ, పరివారానికి దూరంగా వెళ్లడానికీ కారణం వేరుగా చెప్పాడు. అతడొక అడవిపంది వెంటపడి తరుముకు పోయాడు. ఆ పంది మాయచేసిందేమో! చిక్కినట్టేచిక్కుతూ, తిన్నణ్ణి బహుదూరం తీసుకుపోయి ఆశ్చర్యంగా మాయమైపోయింది. అప్పుడు తిన్నడు అలసి, చెట్టుక్రింద నిద్రపోయాడు. ఆ నిద్రలో కలవచ్చింది. ఆ పంది తిన్నని పరమేశ్వరుని సన్నిధికి చేర్చడానికే, మాయచేసి అంతదూరం తీసుకుపోయింది. అది శివుడు చేసిన మాయగానే కవి చెబుతాడు.



సోమన, ధూర్జటి కవు లిర్వురూ ప్రపంచానికి ముఖ్యంగా తెలుగు ప్రజలకు శ్రీకాళహస్తీశ్వరుని నిజమహిమను కన్నులకు కట్టినట్టు తెలిపిన మహానుభావులు. ఆ కవులిద్దరూ 'కన్నప్ప'ను గూర్చి చెప్పిన ఉదంతాలను కలగలిపి నా మాటల్లో పాఠకుల ముందుంచుతున్నాను.

శ్రీకాళహస్తీశ్వరునిగా ప్రసిద్ధమైన ఆనాటి కిరాతభక్తునికి దర్శనమిచ్చిన దివ్యలింగం ఒక కలుజువ్వి చెట్టుబోదె సమీపంలో ఎత్తుగా నిలచిఉంది. అదినొక్కుల తరులు తీరి, సర్పశిరాలు లింగము పై భాగాన తొంగి చూస్తుండగా, విశాలమైన పానవట్టంతో విరాజిల్లుతున్నది. కర్పూరకాంతితో, రుద్రాక్ష చిహ్నంతో, మానవనిర్మితమైనదిగా కాకుండ స్వయంభువై, యుగాలక్రితం వెలసి, ఆలయంలోకాకుండ విశాల ఆకాశం క్రింద సహజ ప్రకృతిలో పరమేశ్వర స్వరూపం ఇదే అన్నటుంది. భూమిపై మరెక్కడా అగుపించని దివ్య భవ్య ద్రవ్యసమాహారం ఆలింగం! 'లింగము' అంటే గుర్తేకదా? శివుని నిరాకారరూపం, అంబతో కలసి ఉన్నరూపం లింగరూపమే కదా? ఆలాంటి లింగరూప శివుని తిన్నడు భౌతికంగా చూచాడు. అది శ్వాసించే వాయులింగం. ప్రపంచంలో ఈ చోట మాత్రమే వెలసి ఉన్న లింగం ఆధ్యాత్మికంగా ఆ దివ్యలింగాన్ని మహాత్ములు 'అనంత, వేదాంత చిన్మయాంగంగా' భావిస్తారు. అవిద్యతో సుఖాసక్తులైన ప్రాణులకు తెలివినిచ్చేదిగా, ముక్తిమార్గాన్ని చూపేదిగా, మొదటి చూపులోనే 'భక్తతిన్ననికి' ఆ లింగస్వరూపం అనిపించింది, కనిపించింది. ఆ భక్తుని శరీరం పులకరించింది. ఆనందంతో కన్నీరుబికింది. సాష్టాంగపడ్డాడు కన్నప్ప. అతనిలో భక్తిభావం మేలుకొనింది. అతనిలోని పారవశ్యం శివలింగం (స్థాణువు) 'కదలినిది' అనే వివేకం కోల్పోయింది. సాకారుడైన శివుడే, ప్రాణవంతంగా, తన ఆత్మీయ బంధువుగా అగుపించాడు అప్పుడాభక్తునికి! అందుకే అమాయకంగా, ఆత్మీయంగా శివునితో మాటలాడటానికి ప్రయత్నించాడు. యోగక్షేమాలు తెలుసుకోవడానికి ప్రయత్నం చేశాడు. అందుకే స్వామితో ఇలా అంటున్నాడు.

## 11) శివునితో తిన్నని అమాయిక సంభాషణం.

"ఓస్వామీ! భాగ్యమంటే నాదే కదా! ఈ నీ సేవకుణ్ణి దయదలచి నువ్వుండే చోటు చెప్పావు. నీవు చెప్పినట్లే వచ్చి నిన్ను కలుసుకోగలిగా. మన చుట్టరికం ఎన్నో జన్మలనుంచి సాగుతూ వస్తున్నట్టు అనిపిస్తుంది నాకు. బుద్ధితెలిసినప్పట్నుంచి నాకు కావలసినోళ్లను పోగొట్టుకొన్నట్లు అనిపించేది. మావోళ్లు ఎంతమందున్నా, ఇంకెవర్నో కలుసుకోవాలనిపించేది. ఇప్పుడు తెలిసింది స్వామీ! నేను చూడాలని కలగంటున్న నాచుట్టమెవరో! ఊళ్లు, పట్నాలూ లేనట్టు పోయిపోయి ఈ నట్టడవిలో వచ్చికూచున్నావేమిదొరా! ఇది పులులూ, సింగాలూ ఉండే అడవాయె; ఇక్కడ ఒంటరిగా ఉన్నావు. ఎంత అపాయమో ఎరగవా? తలదాచుకోను ఇల్లుందా నీకిక్కడ? ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికివణుకుతూ ఈ చెట్టుకింద ఎలాగుంటున్నావు? నీకు ఆకలి దప్పులు లేవా? కూడూ, నీళ్లూ నీ కెవ రిక్కడికి తెచ్చియిస్తారు? వద్దయ్యా! నీవుండటానికి ఈచోటు బాగోదు. నావెంటరా. మాపల్లెకు పోదాం. అక్కడ నీకన్నీ సమకూరుస్తాను."

మా ఇంట్లో చిన్నక్క, పెద్దక్క లున్నారు. వారు వంటలు బలేగా వండుతారు. మేము కొండల్లో, అడవుల్లో వేటాడి తెచ్చేవి పందులూ, లేళ్లూ, దుప్పులూ, రకరకాల పక్షులూ ఉంటాయి. వాటిని చక్కగా కోసి కమ్మగా వండి వడ్డిస్తారు మా అక్కయ్యలు. కనుక నామాటకు ఎదురు చెప్పకుండ నావెంటరా. నీకు మాంసపు వంటలు నచ్చకపోతే నివ్వరిబియ్యంతో, గునుగు బియ్యంతో, వెదురుబియ్యంతో (చమరీమృగాల) సవరపు మెకాల పాలుకలిపి, తియ్యటి పాయసాలు చేయించి పెడతాను. అంతేకాదు. పుట్టతేనె, పెరతేనె, పుట్టజున్ను, తొఱ్ఱతేనెలు మాకు దండిగా దొరుకుతాయి. వాటిలో ముంచుకు తినడానికి కరకరలాడేవి, దుంపలతో చేసినవి వడియాలు ఎప్పుడూ ఇంట్లోవుంటాయి. అవి నచ్చకపోతే బోలెడు పండ్లుకోసి తెచ్చిపెడతారు మా చెంచెతలు. మాకు పండ్లకేమి కొదువలేదు. నేరేడు పండ్లు, నెలయూటిపండ్లు, కొండమామిడి



పండ్లు, దొండపండ్లు, పాలపండ్లు, నెమ్మిపండ్లు, బరివెంక పండ్లు, చిటిముటి పండ్లు, కలివె పండ్లు, తుమ్మికిపండ్లు, జామపండ్లు, గంగరేనుపండ్లు, వెలగపండ్లు, పుల్లవెలగపండ్లు, మోవిపండ్లు, అంకెనపండ్లు, బలుసుపండ్లు, బీరపండ్లు పిచ్చుక బీరపండ్లు, కొమ్మిపండ్లు (ఖర్జూరాలు), గొంచిపండ్లు, అత్తిపండ్లు మొదలైన ఎన్నోరకాల పండ్లు మా చెంచెతలు కలసిమెలసి అడవికిపోయి కోసితెస్తుంటారు. అవన్నీ నీకోసం తెప్పించి యిస్తాను. నీకిష్టమైన పండ్లు సుష్టుగా తినవచ్చు. వస్తావా మా పల్లెకు?

స్వామీ! నీకిక్కడ ఏముందని? ఎవరున్నారని? ఇల్లా? వాకిలా? నీకు ప్రియమైన సావాసగాళ్లున్నారా? చుట్టాలున్నారా? ఇల్లాలుందా? కొడుకులున్నారా? సుఖపడటానికి ఏ వసతైనా ఉందా? అవన్నీ మాపల్లెకు వస్తే నేను సమకూరుస్తాను. కనుక ఒంటిగా నీవీ నట్టడవిలో ఎందుకుంటావు? నావెంట విచ్చేయవయ్యా!

మంచి వయసులో ఉన్న మా ఎఱుకల అమ్మాయిలను, కావలసినంత మందిని నీకు సేవలు చేయడానికి పెడతాను. నాపైన నీకు దయగాని ఉంటే, స్వామీ! ఇప్పుడే నావెంట మావూరికిరా! రాననంటే కుదరదు. నేనూ నిన్ను విడిచిపెట్టి మా వూరికి పోను. నీకు దయ కలిగేదాక ఇక్కడే కాచుకుని ఉండిపోతాను. నే నింత మాటాడుతుంటే నీవేమొ ఒక్క పలుకైన పలుకవు. సరేలే! నీకు ఇష్టమైనపుడే నోరుతెరిచి నాతో మాటాడు. అంతదాక నిన్ను తొందర పెట్టను" అని స్వామిని బతిమాలాడు తిన్నడు. స్వామి ఉలకలేదు పలకలేదు. తిన్నడు సంపెంగవూవు వాసనకు మత్తెక్కిన తుమ్మెద, పూవును విడువకుండ పడివున్నట్టు శివలింగాన్ని విడువకుండ భక్తిమైకంలో పడిఉన్నాడు.

## 12) తిన్ననితో వేటకు వచ్చిన నేస్తాలు అతణ్ణి ఇంటికి పిలిచినవైనం:

అతనివెంట వేటకు వచ్చిన చెంచుబాలురు తిన్నడు తమను కలుసుకోవడానికి రాలేదని, ఆతణ్ణి వెతుక్కుంటూ బయలుదేరారు. అతడు

వేటాడుతూ వెళ్ళిన గుర్తులు పట్టుకొని ఎలాగో అతడున్నచోటికి చేరుకున్నారు. వాళ్లను చూచిన తిన్నడు వారితో మాట్లాడలేదు. వారు పలకరించినా బదులివ్వలేదు. ఏదో లోకంలో ఉన్నట్టు తనలో తాను ఏదో మాట్లాడుకుంటున్నాడు మెల్లగా. అతడి పరివారంలోనివారూ, దగ్గరి సావాసకాండ్రూ ఆందోళన చెందారు. ఏమైంది కన్నప్పకు? ఆశ్చర్యం, ఆదుర్దాతో ఇలాగన్నారు!

"నాయనా! నీవు తరుముకొచ్చిన అడవిపంది ఏమయ్యింది? మేము పలకరించినా మావైపు ప్రేమతో చూడవు, మాట్లాడవు. ఏమైందినీకు? అయ్యో! అదేమి నీకళ్లలో నీరు కారుతుందే! నీలో నీవే ఏవేవో గొణుక్కుంటున్నావెందుకు? ఇటు చూడు! వేటకుక్కలు నీమీదనుండి వచ్చిన గాలినిబట్టి నీవుండే చోటును కనిపెట్టి, మేము వాటిపట్టెడలను గట్టిగా పట్టుకొని నిలుపుతున్నా నిలువకుండ నీవుండే చోటికి మమ్మల్ని లాగుకొచ్చాయి! నిన్ను చూచి ఇవి 'గుర్రుగుర్రు' మని నీచుట్టూ తిరుగుతున్నాయి. వీటినైనా ప్రేమతో చూడవెందుకు? వేటకు వచ్చిన నీకిలాగయ్యిందంటే మీ అమ్మా నాన్నలు బాధపడరా? రావయ్యా! ఇంటికి పోదాము. నిన్ను విడిచిపెట్టి మేమూ పల్లెకుపోము" అంటూ దీనంగా బతిమాలారు. తిన్నడు పేలవంగా నవ్వాడేకాని బదులు పలకలేదు.

అతని సావాసగాళ్లకు కాలుచేతులు ఆడలేదు. దీనంగా తమ బాధను బయటపెడుతూ తిన్ననితో మరల ఇలా అంటున్నారు. నాయనా! మనం వేటకొచ్చామేగాని చేయవలసిన పనులేవీ పూర్తిచేయలేదు. వలలనూ, వేటకుపయోగించే తెరలనూ చుట్టివచ్చేవిధంగా పోగుదారాలతో చుట్టికట్టలేదు. జంతువులను చంపడానికి ఉపయోగించిన పోటుకోలల్ని, జంతువుల శరీరాలనుండి బయటికి పెరికి వేయలేదు. చంపిన జంతువుల్ని ఒకచోటికి చేర్చలేదు. విడివేటకు మచ్చుగా ఉపయోగించే పిట్టలకూ, పక్షులకూ మేతపెట్టలేదు. మన కుర్రాళ్ల కెవరికీ ఇంకా అలసట తీరలేదు. చచ్చిన జంతువులు కుళ్లిపోకుండ



ఉండేందుకు వాటిని కాల్చిపెట్టలేదు. వేటకుక్కలు, సివంగులు, జింకలు నీవు లేకుండటంచేత మేత ముట్టలేదు. జంతువులను బలివేసి కాట్రేనిని కొలవలేదు.

అయ్యో! వేటవినోదాన్ని గురించిన వార్త మీతండ్రికి పంపనేలేదు. నీవెందుకిలా ఉలుకు, పలుకు లేకుండ వున్నావో చెప్పి మా దుఃఖాన్ని పోగొట్టవయ్యా! బాబూ! ని న్నిక్కడ విడిచిపెట్టి మే మెలా వెళ్లగలం? మీ తోబుట్టువులూ, తల్లిదండ్రులూ, స్నేహితులూ మమ్మల్నిచూచి 'మీరందరూ వచ్చారే! మాతిన్నడేడి?' అనిఅడిగితే మేమేమి బదులు చెప్పగలం? మాప్రాణాలుపోవా? మమ్మల్ని తిట్టించక మాతో రావయ్యా! ఇంత బతిమాలినా మమ్మల్ని చూడవు. మాతో మాటాడవు. ఈ విషయాలింక రాజుగారికి చెబుతాము గానీ, నీవు మాకేదైన చెప్పిపంపే విషయం ఉంటే చెప్పు అని తిన్నని కాళ్లు పట్టుకున్నారు. అప్పటికి శివలింగం మీదనే లగ్నంచేసిన మనసు కలవాడైన 'తిన్నడు' నెమ్మదిగా కళ్లుతెరచి నేస్తగాళ్ల వైపుచూచాడు. ఆ చూపులో జాలి, దయతొంగి చూస్తున్నాయి. చివరికి నోరుతెరచి అన్నాడిలా.. "ఈ శివలింగంతో నా ప్రాణాన్ని ముడివేసి ఉన్నాను. ఓడతో కట్టిన ఓడలాగ, చచ్చేదాక నా బ్రతుకు ఈ లింగంతోనే! మీరెందుకు చింతిస్తారు? ఇక మీరు గూడేనికి పొండి. నావెంట ఈ స్వామి వస్తే, నేనూ మన పల్లెకు వస్తాను. లేకపోతే ఈయనతోనే ఉండిపోతాను. నాకీ దేవుడే బంధువు. తల్లీ తండ్రి స్నేహితులూ ప్రభువూను! మీరు తొందరపెడితే అసలురాను. ఇక్కడే ప్రాణాలు విడుస్తాను." అని చెప్పిమరల శివుని ధ్యానంలో మునిగిపోయాడు. ఇక చేసేది లేక శబరకుమారులు వచ్చిన దారినే తిరిగి వెళ్లారు. జరిగిన విషయం రాజుకు చెప్పడానికి.

## 13) మరల శివుని వాడైపోయిన తిన్నని చేష్టలు:

మాపల్లెకు పోదాము రమ్మని బతిమాలిన తిన్నడు, ఆశలుచూపిన తిన్నడు ఆలోచనలోనూ పడ్డాడు. అసలీస్వామి ఎందుకిలా ఒంటరిగా వచ్చి అడవిలో ఉంటున్నాడు? అనే సందేహం వచ్చింది. తన కీ స్వామే కలలో కనిపించాడు. ఇక్కడికి రప్పించాడు.

"కలగన్న చోటికి గంప గొంపోవ
ఫలసిద్ధి అగుటెల్ల భాగ్యంబు కాదె!
మును తపోమూర్తి నెప్పిన లింగ మిదియ!
తన ప్రాణనాథుడౌ....."                (బసవ.పురా)

తాను కలగన్నాడు. కలలో ఏదోగొప్పనిధి దొరుకుతుందని సూచన. తెలివున్న వాడెవడైన కలలోని నిధిని తీసుకురావడానికి గంపను తీసుకుపోతాడా? పోనేపోడు. అయితే ఆ నిధి పరమేశ్వరుడే. తిన్నని కలను నిజంచేశాడు. అందుకే అమాయకుడైన తిన్నడు స్వామితో అన్నాడు".

"బాస గాదింక ఈ ప్రాణ లింగంబు,
బాసిపో తగదు మా పల్లియ కితని
కొనిపోయి కట్టుదు– 'పాక'....."

అని నిశ్చయించుకున్నాడు. గూడులేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న స్వామిని తప్పక తనవెంట తీసుకుపోవాలి. ఆయనకొక 'పాక' వేయించాలి....'గుడి కట్టించడం' అంటామేమో ఇప్పట్లోనైతే. కాని 'కన్నప్ప' పాకవేయించాలని సంకల్పించాడు. స్వామిని ఒంటిగా అడవిలో విడిచిపోతే ఎండకు కాగిపోతాడు. తాను రానన్నాసరే! ఎలాగైనా బుజ్జగించి ఉడుమూరికి తీసుకుపోవాలనుకున్నాడు. అలా స్వామి తమవూరికి వస్తాడనే ఆలోచన రాగానే అతని ఒళ్లు పులకరించింది. ఆ యానందంతో స్వామి ఉనికిని గూర్చి ఎన్నో ప్రశ్నలు.

నీ వొక్కడవే వచ్చి ఈ యడవిలో ఎందుకున్నావు స్వామీ! అలిగి వచ్చావా? చెప్పు. అలాగైతే నేనువచ్చి మధ్యస్థం చేస్తాను. అలుక తీరుస్తాను. ఎవరైన నీకు ఉమ్మెత్త పూవుల్తో పూజచేశారా? ఆ వాసన తగిలి నీకు 'మరులెత్తి' ఉండాలి. అందుకే నీవు అడవికి పరుగెత్తుకు వచ్చివుంటావు. అలా కాకపోతే, నీవు శ్రీశైలం మీద ఉన్నప్పుడు భక్తులు విరివిగా వచ్చి జాతర్లు జరిపిస్తుంటే,



ఆ గోలకు తట్టుకోలేక పారిపోయి వచ్చి ఇక్కడున్నావా? నీతలపైని జడలకోసం, నీ శరీరంలో 'భాగం'కోసం, నీపెండ్లాలైన 'గంగమ్మ' 'పార్వతులు' పోట్లాడుకొంటుంటే వారికి సర్ది చెప్పలేక ఇక్కడికి వచ్చేశావా? 'ఒడయనంబి' అనే భక్తుడు నీచేత చాకిరీ చేయించుకొంటుంటే ఆ పనులు చేయలేక తప్పించుకొని వచ్చి ఇక్కడ దాగున్నావా? 'పూర్వబ్రహ్మ' 'ఇప్పుడు' న్యాయంతప్పి నడుచుకొంటుంటే అతడిని వేటాడటానికి వచ్చావా? లేక నాపైప్రేమతో నన్ను కాపాడటానికి ఇక్కడికి వచ్చావా? ఎక్కడి నుంచి వచ్చావయ్యా? నీవిక్కడ ఎన్నినాళ్లుంటావు? నీకు బ్రతుకెలాగ? నీవు ఎప్పుడు ఎక్కితిరుగుతుండే 'ఎద్దు' నిన్నిక్కడ వదిలేసి ఎక్కడికి పోయింది? చెప్పు! నేవెళ్లి వెదకి పట్టుకొస్తాను. నీ శరీరంలో సగమైన 'పార్వతమ్మ' ఒంటరిగా నిన్నిక్కడ విడిచి ఎక్కడికెళ్లింది? ఈ విషయం తెలిస్తే లోకం నవ్వదా? నీవు పెట్టేది 'గోచి.' ఆ గోచిని కూడ విడిచిపెట్టి (దిగంబరునిగా) అడవి కెందుకొచ్చావో చెప్పు? నీ చంకలోనిజోలెలో ఏమీవున్నట్టు లేదే. అందుకే చొట్టబడివుంది! దాన్నెలా నింపుకుంటావు?

ఓ శంకరయ్యా! ఈ కొండల్లో, అడవుల్లో ఉండటానికి భయమెయ్యదా? క్రూరమృగాలూ, పాములూ లెక్కలేనన్ని ఉన్నాయిక్కడ. చాలాప్రమాదం. నావెంటరా! నీకు మాపల్లెలో కావలసినవన్నీ సమకూరుస్తా!

"రావయ్య మ్రొక్కెద దేవదేవుండ!
ప్రేవులు మాడంగ చావ తప్పినదె!"                (బసవ.పురా)

అంటూ శివుని పాదాల మీద పడి దీనంగా వేడుకున్నాడు. ఏడ్చాడు. ఏమి చేసినా స్వామి నుండి బదులు లేదు. మౌనంగా, జాలిగా తిన్నని వంక ఆ స్వామి చూస్తున్నాడనిపించింది. తిన్నని వంక ఆ స్వామి చూస్తున్నాడనిపించింది. తిన్నని మనసులో స్వామి మౌనానికి కొత్తకారణాలు ఏవో ఊహలకొచ్చాయి. అందుకే తనలో ఇలా వితర్కించుకోనారంభించాడు. 'మదనుణ్ణి దహించాక' స్వామి ఇక్కడికి వచ్చివుంటాడు. వచ్చాక తినడానికి ఇక్కడ తనకేమీ దొరికి ఉండదు. కనుక చాన్నాళ్ళు పస్తులవల్ల స్వామికి నీరసం

వచ్చివుంటుంది. అందుకే మాటాడలేక పోతున్నాడు. చెవులు చిల్లులు పడేటట్టు అరచి చెప్పినా వినిపించినట్టులేదు. అందుచేత ముందీయనికి తినడానికి ఏమైన వెంటనే తెచ్చిపెట్టాలి" అని అడవిలోనికి బయలు దేరాడు అమాయకుడైన 'తిన్నడు.'

## 14) 'తిన్నడు' శివునికి చేసినసేవలు, పూజలు

స్వామిని తనపల్లెకు వస్తే ఎన్నివిధాల సేవించుకోగలడో ముందే చెప్పాడుగదా తిన్నడు! ఏయే వంటకాలు చేయించి పెడతాడో, ఎవరెవరితో ఎలాంటి సేవలు చేయిస్తాడో వివరంగా స్వామికి విన్నవించే ఉన్నాడు. దేనికీ బదులు చెప్పలేదు స్వామి. ఇప్పుడేమో బువ్వతినక పోవడం వల్ల నీరసంవచ్చిన దేవుడు తనతో మాట్లాడలేక పోతున్నాడని తలచిన తిన్నడు, శివునికి వెంటనే మంచి జంతుమాంసం తెచ్చిపెట్టాలని అడవికి బయలు దేరాడు. కానీ ఆకలి తీర్చడానికి కందమూలాలు పండ్లూ కాయలు కూడ దొరకలేదు ఆశ్చర్యపోయాడు. మరికొంత దూరం వెళ్లాడు. అప్పుడు ఒక వింత జరిగింది. మాంసపు పుష్టిగల జంతువులు కొన్ని, మచ్చికయినవిలా, తమంత తాముగా తిన్నని చెంతకు వచ్చాయి. ఆతని చేతికి చిక్కాయి. అతనికి ఆనందమయింది. అది మొదటిదినం. అందినవాటిలోనూ కొన్నింటినే పట్టుకొచ్చాడు. పక్వంగా కాల్చి రుచిచూచి మేలురకం మాంసపు ముక్కల్ని దొన్నెలో పెట్టితెచ్చి స్వామిని తినమన్నాడు. ఆ దినం తిన్నడు దొన్నెనింపి తెచ్చింది అడవిపంది మాంసం. దేవునికి ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టే పద్ధతి వారి దేవతకు పెట్టేటప్పుడు చూచి ఉన్నాడు తిన్నడు. కాని ఆ నైవేద్యం పెట్టేటప్పుడు అభిషేకించేపద్ధతి అలంకరించే పద్ధతి లాంటివి ఎలా చేయాలో పూర్తిగా తెలియదు. తనకు ఈ దినం శివునికి ఆకలి తీర్చడానికి ఆహారం తెస్తున్న తిన్నడు తనకు తోచిన రీతిలో తతిమ్మా పూజా విధానాన్నీ పాటింపదలచుకున్నాడు. సువర్ణముఖరీ నదిలో మునిగి లేచాడు. అతడు చంకలో విల్లు తగిలించుకొన్నాడు. వీపున అమ్ముల పొది ఉంది. కాళ్లలో చెప్పులు అలాగే ఉన్నాయి. మాంసపుదొన్నెలు చేతుల్లో ఉన్నాయి. నెత్తిన తాను సేకరించిన



మారేడు దళాల్ని, చింకిజుట్టు మధ్యతట్టలో పెట్టినట్టు అమర్చుకొన్నాడు. నోటినిండుగా పవిత్రమైన సువర్ణముఖరీనది నీటిని నింపుకొన్నాడు. పరమేశ్వరుని పవిత్రలింగం చెంతకు భక్తితో చేరాడు.

అంతకు ముందు ఆ శివలింగంపై ఉన్న పదార్థాలేవో, వాటినంతా తన చెప్పుకాలితోనే ప్రక్కకునెట్టి శుభ్రంచేశాడు. నోటినిండుగా పట్టితెచ్చిన పవిత్ర నదీజలాన్ని తన పుక్కిటినుండి వేగంగా వెళ్లి శివలింగం మీద పడేటట్టు ఊశాడు. చిమ్మనగ్రోవినుండి చిమ్మినట్టుగా తిన్నని పుక్కిటి నీరు శివునిపై ప్రేమ వర్షంలా, భక్తివృష్టిలా స్వామికి హాయి గొలిపేలా కురిసింది. స్వామి సంతోషంతో ఆనంద బాష్పాలు విడిచాడా అన్నట్టు ఆ దివ్యలింగం నుండి తిన్నని ఎంగిలి నీరు చారలుగా క్రిందికిజారుతున్నది. తిన్నడు నెత్తిపై పెట్టుకుని తెచ్చిన మారేడు ఆకుల్ని లింగంపై విదిలించాడు. స్వామిముందు మోకాళ్లపై కూచున్నాడు. తన చేతుల్లోని పక్వంగా కాల్చిన పందిమాంసపు ముక్కల దొన్నెల్ని స్వామిముందుకు జరిపి భక్తితో ఆతురతతో వినయంగా వేడుకొంటూ తినవయ్యా దేవా! ఎన్నాళ్లుగా పస్తులున్నావో! ఎంతగా ఆకలేసిందో! బాగున్నాయి ఈ కరకుట్లు. తిను. ఆకలి తీరుతుంది. నీరసంపోతుంది. మరల మనవిషయాలు మాట్లాడుకుందాం అంటూ అమాయకంగా వేడుకున్నాడు తిన్నడు. తినమనగానే తినడానికి ఆ లింగరూపుడైన పరమేశ్వరుడు తిన్ననిలా అమాయకుడా? భక్తులను పరీక్షించకుండ భగవంతుడు ఎప్పుడైనా, ఎవరినైనా కరుణించాడా? అదే జరిగిందిప్పుడు. స్వామి తినలేదు. పలకనూ లేదు.

మరల ఈ భక్తునిలో కలవరం. సందేహాలమీద సందేహాలు! ఎందుకు తినలేదు స్వామి? ఆకలి కాలేదా? లేక నేను భక్తితో తేలేదా? ఈ మాంసపు ముక్కల్ని నేను సరిగా కాల్చి పక్వంచేయలేదా? ఇవి క్రొవ్విన మాంసపు ముక్కలు కావా? కమ్మగా లేవా? లేక నీకు ఆకలికి చాలవనుకొన్నావా? ఎందుకు మౌనం? సెలవియ్యవయ్యా స్వామీ! నన్ను దయచూడు. నీవు ఉపవాసంతో బడలి ఉన్నావు. నాకు తెలుసు. నీవు తినలేకుంటే నేనే తినిపించగలను. నామీద నెపంవేయకు. ఇదిగో! అందుకో! అంటూ దీనంగా ప్రాధేయపడ్డాడు తిన్నడు.

ఆ కపట మెరుగని భక్తుని చిత్తశుద్ధిని శివుడు మెచ్చుకొన్నాడు. లింగంనుండి సాకారుడై తిన్నని కరుణించి తన పాదాలమీద వాలిన వాడ్ని పైకి లేపాడు. నవ్వుతూ, బుజ్జగిస్తూ, "బాబూ! నీవుతెచ్చిన ఆహారం తింటాను. ఏదీ! అందివ్వు!" అన్నాడు. తన్మయుడైన కన్నప్పకు 'ఓం నమశ్శివాయ' అనే మంత్రం అప్రయత్నంగా నోటినుండి వెలువడింది. ఇక ఆ మంత్రం ఉచ్చరించడం ఆపలేదు తిన్నడు. 'నమ శ్శివాయ' అంటూనే అన్నిపనులూ చేస్తున్నాడు. స్వామి అందివ్వమన్నాడు నైవేద్యం. తిన్నడు అందిస్తున్నాడు తాను కాల్చి తెచ్చిన పందిమాంసపు ముక్కల్ని. మనకది అపవిత్రం అనిపించవచ్చు. స్వామికి అతని చేతినుండి ఆప్యాయంగా అందుకోవడం, ఆనందంగాఉంది! అలా మొదటి నాటి తిన్నని శివపూజ ముగిసింది. దేవ దానవ మానవ ఋషి మునిగణాలకు కూడ సాధ్యంకాని పని సాధించినందుకు తిన్నడు అబ్బురపడలేదు. గర్వపడలేదు. కేవలం తనమొర ఆలకించాడని సంతోషించాడు. అలా ప్రారంభమైన కిరాత భక్తుని శివపూజ మరుదినం నుండి మొదటి దినంలాగే కొనసాగింది.

దినదినమూ వేటకు వెళ్తాడు. అడవి జంతువులు ప్రయత్నం లేకుండానే అతనికి చిక్కుతాయి. అందులో మంచి జంతు మాంసాన్ని అతడు పక్వంచేసి చేతి దొన్నెల్లో పెట్టుకుంటాడు. నదిలో మునిగి, పుక్కటినిండా నదీపవిత్రజలాన్ని నింపుకుంటాడు. తన చింపిరిబొంపిరిజుట్టునే తట్టగా చేసుకుని అందులో తానుసేకరించిన లేతవీ, చిరిగిపోనివీ, కళకళలాడేవీ అయిన మారేడు దళాల్ని నింపుకుంటాడు. చెప్పుకాళ్లతోనే శివలింగం వద్దకు చేరుకుంటాడు.

ఆ శివలింగంపై వేరొక భక్తుడు వేసిన పూజాద్రవ్యాలు కాబోలు! తాను వేసినవి కావని తన చెప్పుకాలితో ప్రక్కకు నెట్టివేస్తాడు. పుక్కిటబట్టిన సువర్ణముఖరీజలాలను ఎంగిలయ్యాయనే స్పృహ లేకుండ స్వామిపై ఉమిసి అదే అభిషేకంగా భావిస్తాడు. తననోట అనుకోకుండ తిరిగిన 'నమశ్శివాయ' ను ఉచ్చరిస్తూ తెచ్చిన మాంసభోజనాన్ని, బతిమాలి, బుజ్జగిస్తూ స్వామికి



తినిపిస్తాడు. ఆపై దినమూ, రాత్రి అనిలేకుండ స్వామిని చేరి 'నమశ్శివాయ' అంటూ ఉంటాడు. స్వామికోసం తెచ్చిన మాంసపుముక్కల్లో రుచిగా లేవని ప్రక్కన పెట్టినవానినే తాను తిని ఆకలి తీర్చుకుంటాడు. వేటకు వెళ్లి తిరిగి వచ్చేదాకనే తిన్నడు స్వామికి దూరంగా ఉండేది. మిగిలిన సమయమంతా శివుని సన్నిధిలోనే.

## 15) శివాపచారమని వగచిన బ్రాహ్మణభక్తుడు:

తిన్నడు పూజిస్తున్న, పవిత్రమైన వాయులింగేశ్వరుణ్ణే మరొక బ్రాహ్మణ భక్తుడూ నిత్యమూ సేవించేవాడు. ఆతని పూజనే తిన్నడు చెప్పుకాలితో చెరిపివేసి, తన తరహా పూజను కావించేది. తిన్నడు మాంసపు ముక్కల్ని స్వామికి తినిపించి, మిగిలినవి తాను తిని ఎంగిలాకుల్ని అక్కడే పారవేసేవాడు. అతని పుక్కిటి నీటితో శివలింగం తడపడం వల్ల ఎంగిలిచారలు శివలింగంపై కనిపించేవి. సుగంధపుష్పాలతో బ్రాహ్మణ భక్తుడు పూజించి వెళ్లిన చోట తిన్నని ఎంగిలి మంగలమైన పూజతో పరిసరమంతా దుర్వాసనతో నిండేది. ఇలా నిత్యమూ జరిగిపోవడం చూచిన బ్రాహ్మణ భక్తునికి కోపం వచ్చింది. బాధ కలిగింది. ఎవడో తుంటరి తన పూజను ఉద్దేశపూర్వకంగానే పాడుచేసి పోతున్నాడనిపించింది. తనబాధను స్వామితో చెప్పుకున్నాడు. మొరపెట్టుకున్నాడు. నిష్ఠుర మాడాడు కూడ. "ఇదేమిటి స్వామీ! నీవు నా ఇలవేల్పని, నీ మందిరాన్ని నిత్యమూ వచ్చి శుభ్రపరుస్తున్నాను. అలికి, పూసి, ముగ్గులేసి అలంకరించి పోతున్నాను. అయితే ఈ మధ్య ఎందుకో ఈ గుడిలో నీముందూ, నీపైనా కసుమాలాలన్నీ పడి ఉంటున్నాయి. ఎవడో పనిగట్టుకుని ఈ పనికి మాలిన పని చేసిపోతున్నాడు. నీవు వద్దనుకుంటే నీవద్దకు వచ్చి ఈ కసుమాలపు పనులు చేసి వెళ్లగలవా డెవ్వడు? ఒకవేళ నీవే ఈ మాయ సృష్టించి నన్ను పరీక్షిస్తున్నావా? లేక నిజంగానే వేరొకడు ఈ పని చేస్తున్నాడా? ఇక నేను భరించలేను దేవా! నీకైతే ఇవి అలవాటు అయినవే! శ్మశానంలో బూడిదను ఒంటికి పూసుకోవడానికి పాలుమాలని వాడవు. తలపుఱ్ఱెలో అన్నం

పెట్టుకు తినడానికి వెనుదీయనివాడవు. ఈ మాత్రపు రోతకు వెనుదీస్తావా? నీకీపూజ ఇష్టమైతే వుండనీ! ఇలా చేస్తున్నవా డెవడో అతణ్ణి నాకు చూపించు, అదేనాకు పదిలక్షలు! నీవలాచేయకపోతే నేను తిండీ నీరు లేకుండ పస్తుండి ప్రాణం విడుస్తాను. ఎక్కడో కాదు ఇక్కడే; నీపాదాల వద్దే" అంటూ బోరుమని ఏడుస్తూ స్వామిముందు నిలిచాడు పాపం! ఆ బాపడు.

## 16) తిన్నని భక్తిని శివబ్రాహ్మణునికి చూపిన శివుడు

అప్పుడు ఆశ్చర్యకరంగా శివునివాణి వినిపించింది. ఏమని? "శివగోచరా! చింతించకు. నన్నొక చెంచుభక్తుడు వేదేతర పద్ధతితో పూజిస్తున్నాడు. అయినా అతని భక్తి నిర్మలమైనది. అమాయకత్వంతో కూడినది. దృఢసంకల్పంతో కూడినది. కనుక అతణ్ణి కనికరించాను. ఆతని పూజ ఎలాగున్నా స్వీకరిస్తున్నాను. వాడు అసామాన్యుడైన భక్తుడు. కొంతసేపు నీవు నావెనుక దాగి ఉండు. కొంచెంసేపట్లో అతడు వస్తాడు. అతని భక్తివిశ్వాసాలు ఎంతగాఢమైనవో నీవే కళ్లార చూడగలవు" అంటూ శివలింగం నుండి వినిపించిన మాటలకు బ్రాహ్మణ భక్తుడు ఉలిక్కిపడ్డాడు. 'ఈ మృదుమధురమైన అమృతవాక్కులు సాక్షాత్తూ పరమేశ్వరునివే. సందేహం లేదు. స్వామి సెలవిచ్చినట్టే వెళ్లి వెనుక దాగి గమనిస్తాను. నాకు కావలసినవాడు నాకు దొరుకుతాడు. నా కోర్కెనిలా స్వామి మన్నించాడు. ధన్యుణ్ణి. అనుకొంటూ శివలింగం వెనక్కి వెళ్లి నక్కి కూర్చొని తన పూజను పాడుచేస్తున్న భక్తు డెవడో చూడాలి. అతని పనిపట్టాలి అని ఎదురుచూస్తున్నాడు.

అంతలో 'కన్నప్ప' ఎప్పటిలాగే వచ్చాడు. చెప్పుకాలితో బాపని పూజను తొలగద్రోశాడు. పుక్కిటి నీటితో లింగాన్ని అభిషేకించాడు. కాల్చితెచ్చిన మాంసపు ముక్కల్ని తినుమని స్వామి ముందుంచాడు. కాని ఆ దినం శివుడు తిన్నని పరీక్షింప దలిచాడు. శివబ్రాహ్మణునికి ఆతని భక్తిశక్తిని చూపదలచుకొన్నాడు కనుక మాంసాహారాన్ని స్వీకరించడానికి ప్రత్యక్షమూ కాలేదు. తిననూ లేదు. పైగా శివలింగంపై 'తనమూడు కండ్లను' సజీవంగా



ప్రదర్శించాడు. అందులో స్వామి కుడికంటినుంచి నీరు కారుతోంది. మొదట సన్నగా కారుతున్న కన్నీరు కొంతసేపటికి పెద్దధారగా మారింది. తాను తెచ్చేమాంసం ఇష్టంగా అడిగిపెట్టించుకుని తినే స్వామి, నే డెందుకో బెంగపెట్టుకుని తినకుండ ఉన్నాడు. తినకపోతే పోయెకాని ఈ కన్నీరేమి? ఎవరికోసం? ఏమిటిబాధ? ఈ కన్నే బాధిస్తుందా? ముందు ఆ స్వామి కంటి కేమయ్యిందో తెలుసుకోవాలి? అని శివుని శిరసుపై మారేడు దళాలను తొలగించి చూచాడు. తిన్నడికి అర్థమయ్యింది. స్వామికంటికేదో అయ్యింది! దీనికేదైన వైద్యం చేయాలి. నాకైతే వైద్యం తెలియదు. ఈ యడవిలో వైద్యులు దొరకరు. వెదకి బయటి నుండి వైద్యుణ్ణి తీసుకొద్దామంటే అంతలో ఈ కంటి కేమౌతుందో! కనుక నాకు తెలిసిన మందులేవో నేనేవేసి స్వామి బాధ మాన్పుతా' అని తిన్నడు శివునికి కంటివైద్యం చేయబూనుకొన్నాడు.

ఈ లోపున శివుని వెనుక నక్కిచూస్తున్న బ్రాహ్మణభక్తునికి తిన్నని మీద (అతనిని చూడకమునుపు) ఉండిన కోపం పూర్తిగా పోయింది. ఇత డెవడో కారణజన్ముడు లాగున్నాడు. వీడు స్వామి మీద ఉమిసిన పుక్కిటినీటి ధారలు ఎంగిలిధారల్లా అనిపించడంలేదు. శివుని కన్నీటికి పరిహారంగా అంతర్ధార ఎత్తినట్టు మారేడు పత్తిరిని తడుపుతూ మంగళకరంగా శోభిస్తూ క్రిందికి జారుతున్నట్టు అనిపించాయతనికి. అతని పట్ల ఉండిన ద్వేషభావం నశించి గౌరవభావం అతిశయించింది. శివుని తలమీది గంగ, అతని పాదం తగలడం వల్ల అక్కడినుండి తప్పుకొని ప్రకాశిస్తూ (అభిషేకిస్తూ) శివుని పాదోదకమౌతున్నట్టనిపించింది! లింగమూర్తి పరమశివుడు భక్తునికి మెచ్చి, ఆనందబాష్పాలు విడుస్తున్నట్టనిపించింది. శివుని కన్నీరు, బ్రాహ్మణ భక్తునికేమో, తిన్నడు పుక్కిటి నీటితో అభిషేకించగా, క్రమంగా జారుతూ క్రిందికి దిగుతున్నట్టు భ్రమ కలిగించింది! 'ఒక ప్రసాది లభించే త్రివిధోదకమే ఆతని నోటిజలం!' అనే భావనలో, 'ఆ ముగ్ధభక్తుని ఔన్నత్యంలో తానెంత?' అని తిన్నని కంటివైద్య ప్రయత్నాలను శ్రద్ధతో గమనిస్తున్నాడు భక్తుడైన భూదేవుడు.

## 17) తిన్నడు శ్రీకాళహస్తీశుని కంటిహానికి చెందిన మనస్తాపము

తనకు తెలిసిన కంటివైద్యమేదో అదిచేసి, స్వామికి ముందు కంటి బాధ తగ్గించాలనేది తిన్నని సంకల్పం. బాధ తగ్గితే, వెళ్లి మంచి వైద్యుని పిలుచుకుని రావచ్చు. ఆ ప్రయత్నంలో తిన్నడు స్వామికంటిని దగ్గరగా వెళ్లి పరీక్షగా చూచాడు. అది ఎఱ్ఱబారిఉంది. నీ రుబుకుతూంది. స్వామి బాధను చూచి అతనికి దుఃఖం తన్ను కొచ్చింది. మనసులో బాధను ఆపుకోలేక పోయాడు. స్వామితో అంటున్నాడిలా. "ఇదేమి దేవరా! నీకంటనీరా? దక్షుడు యజ్ఞం చేస్తున్నపుడు పిలువకనే వెళ్లిన సతీదేవి, నీ అర్ధాంగి ఆ యజ్ఞంలో పాల్గొన్న దేవతలూ, ఋషులూ, మునులూ, ముల్లోకవాసుల ముందు నిన్ను నిందించగా ఆ నింద భరించలేక తనకు తానుగా భస్మమైపోయింది. నీభార్య మరణవార్త విన్నపుడు కూడ నీవు కన్నీరు విడువలేదు కద స్వామీ! సిరియాళుడనే చిన్నవాడ్ని, తండ్రిచేతనే చంపించినపుడు కూడ జాలితో నీకంట నీరు రాదాయె" బదరికావనంలో మునులు నీకట్టుపుట్టం చింపి గొడవ చేసినపుడూ నీవు కన్నీరు నింపలేదు. ఒక భక్తుడు నిన్ను పూజించడానికి పూలుదొరక్క రాళ్లు వేసి పూజించినపుడూ (నొప్పితగిలినా) నీకు కళ్లవెంబడి నీరు కారలేదు. ఒక భక్తుని కోసం ఒకస్త్రీ దగ్గరికి రాయబారం వెళ్లవలసి వచ్చినపుడూ (అవమానభారంతో) నీవు కన్నీరు పెట్టలేదు. 'నంబి' ఇంట తట్టలు మోస్తూ, వెట్టిచాకిరి చేసినపుడూ నీకంట నీరు రాలేదు. ఈ దినం ఏ కారణం లేకుండ నీకంట్లో ఈ నీరెందుకు?

భార్యనూ, బిడ్డల్నీ వదలి అడవికి వచ్చినందుకు బాధపడుతున్నావా? అడవిలో ఏకాకిగా ఉంటూ ఈ లోకాల నన్నింటినీ, ఎలా కాపాడగలనని దిగులుపడి కన్నీరు విడుస్తున్నావా? సమయానికి వచ్చి, నీకు నేను బువ్వ తినిపించి, ఆకలి తీర్చలేదని ఏడ్పువచ్చిందా? నేను నీ ఆహారంకోసం అడవికెళ్లి, ఏ క్రూరజంతువు వల్లనైన బాధపడ్డానని బెంగపడితే, ఈ కన్నీరు కారుతున్నదా? నీకు సేవచేసే ఓ పికలేక, మాటతప్పి, నిన్ను ఒంటరిగా ఈ యడవిలో విడిచిపెట్టి, మావూరికి వెళ్లిపోయానేమోనని ఏడ్పు వచ్చిందా? కారణం



చెప్పుస్వామీ! నావంటి కొడుకు ఉండగా నీకేల దిగులు? మనబంధం విడిపించుకుందామన్నా వీడిపోయేది కాదు. నీసరిజంగాలు నీవిలా ఏడుస్తుంటే నవ్వరా? ఊరుకో తండ్రీ! ఊరుకో స్వామీ!" అంటూ శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకొని ఓదార్చాడు! కన్నీరు తుడిచాడు. గుడ్డతో కంటిపై ఒత్తుతూ, 'నా పిచ్చిగాని నీకంట్లోనుంచి నీరు కారడానికి నేను అనుకొన్న వేవీ కారణాలయ్యుండవు. ఏదో కసవు పడుంటుందంతే! అంటూ కనురెప్పలు విప్పిచూచాడు. నోటితో గట్టిగా ఊదాడు. తన నాలుకను కనుగుడ్డుపై పెట్టి, మెల్లగా త్రిప్పాడు. తువ్వాలు బట్టను తన నోట్లో పెట్టుకొని, ఆవిరిపెట్టి, వెచ్చని ఆ గుడ్డతో స్వామికంటిపై కాపడం పెట్టాడు.'

అలా గుడ్డతో ఒత్తుతూ కన్నీరు ఆపే ప్రయత్నం చేశాడు. బట్ట తడిసిందే కాని కన్నీరు ఆగలేదు సరికదా, ఇంకా ఎక్కువయ్యింది. ఒకవైపు నీరు కారుతున్నదని బట్టతో ఒత్తితే మరోవైపు నీరు మరలుతున్నది. అప్పుడు తిన్నడు అరిచాడు. ఏడ్చాడు. పాదాలపైబడి దీనంగా వేడుకున్నాడు. కూర్చుంటూ, లేస్తూ, తడబడుతూ, 'అయ్యయ్యో'! అంటూ, అటునిటు అడుగులేస్తూ, తనలో వితర్కించుకుంటున్నాడు. ఈ దేవుని కంట్లో కారుతున్నది ఏడుపు కన్నీరు కాదు. ఆనందంతో వచ్చేది కావచ్చు! అలాగైతే ముఖంలో ఆనందం కనిపించలేదే! నాపై కరుణతో విడుస్తున్న 'కారుణ్యజలం' అనుకుందా మనుకుంటే ఈ నీరు వేడిగా ఉందే! ఇంకేమైన తలచుకొని ఏడుస్తున్నాడు అనుకుందామంటే, ఏడ్చేవారికి రెండుకళ్లలో నీరు రావాలి కదా! కనుక ఇదేదో కంటిజబ్బే! ఏమి జబ్బుయి వుంటుంది?

గోడిరెప్ప పెరిగిందా? తడికంటి విధమా? పొరకప్పిందా? మాదతెగులా? పూవుపడిందా? మయిలపడిందా? మాంసం పెరిగిందా? తప్పక ఇది కంటిజబ్బే! కాని, ఏమి జబ్బో! దానికి ఏ మందు వేయాలోనాకు తెలియదే. అయ్యో! నీకిలాంటి జబ్బు ఎలా వచ్చిపడిందయ్యా? నీవు మూడు కన్నులవాడవని, ముల్లోకవాసులూ భయపడతారు. అపజయంలేని అగ్రదేవుడివి

నీవేనంటారు. నిన్నిపుడు ఇలాచూస్తే, నీవు పాలించే దేవతలు నిన్ను మెచ్చుకుంటారా? లెక్క చేస్తారా? నీ కంటిమంటకు రాలినవారు, నీ కంటి వార్తతెలిస్తే, మరలా చెలరేగిపోరా? ఒకవేళ మాతల్లి పార్వతమ్మ అందాన్ని 'కోరికతో' చూడటం వల్ల, నీ కన్ను ఎరుపెక్కి నీరువస్తున్నదా? ఊఁహు! అలా జరిగిఉండదు. నీవు యోగివి. విరాగివి ఆడవారి అందానికి ఆశపడేవాడివీ కాదు. లొంగేవాడివి అసలేకాదు. ఆడవారి అందాలు నీసగం దేహంలో అణగే వున్నాయి. నీకు అందరికిలాగ రెండుగాక, మూడుకళ్లు ఉండటంచేత 'విరూపాక్షుడ'వని ఇదివరకే పేరుంది. ఇప్పుడా మూడింటిలో ఒక కన్నుపోతే కురూపివి అయిపోవా? అప్పుడు నిన్ను ఏ స్త్రీ అయినా చూస్తుందా? నీ భక్తులు కూడ నిన్ను చూచి 'ఇహీఁహీఁ' అనరా?

ఆ శ్రీహరి ఒకప్పుడు నీకు తన కన్నిచ్చి, నీవద్ద చక్రం పుచ్చుకున్నాడుకదా! ఆ స్వామి విలువైన కన్నేకదా ఇది! ఇప్పుడు దీనికిలా జబ్బుచేస్తే, ఆయన 'మహిమ' ఏ మయ్యేటట్టు? దేవా! నా బ్రతుకిప్పుడు 'పొలంలోని ఆబోతును పులి లాక్కొని పోయినట్టు' అయ్యింది. ఎవరికి చెప్పను? ఎటుపోయి ఏమి చేయగల్ను? చెప్పక, చేయక, ఊరక ఎలాగుండను? అలాకాదు. ఎలాగైనా నీకంటి నొప్పిపోగొడతాను" అని తిన్నడు తనకు తెలిసిన కంటివైద్యం చేయ నారంభించాడు.

## 18) తిన్నడు శ్రీకాళహస్తీశునికి చేసిన కంటివైద్యము

పరమేశ్వరుడు కన్నప్పభక్తుని 'భక్తిని' స్వయంగా పరీక్షించడానికీ, శివబ్రాహ్మణునికి ఆతని భక్తిమహిమ చూపడానికీ, తాను చూపిన మాయలో భాగంగా, శివలింగంపై చలించే కండ్లు ప్రత్యక్షమయ్యాయి. ఆ మూడు కళ్లలో, కుడికంటినుండి, క్షణక్షణానికీ అధికమౌతూ నీరు కారుతున్నది. ఆ నీటిని ఆపే ప్రయత్నం చేసిన తిన్ననికి, ఆ పని సాధ్యం కాలేదు. కనుక తానిపుడు తెలిసిన వైద్యం చేయ నారంభించాడు.



నోటితో ఆవిరిపట్టిన వెచ్చని వస్త్రాన్ని స్వామి కంటిపై పెట్టి ముందే కాపడం పెట్టాడు. నీరు ఇంకగా ఒత్తాడుకదా! ఇప్పుడు తనకుడిచేతి అరచేయి ఎడమభాగాన్ని, ఎడమచేతి  అరచేతిలో వేడిపుట్టేదాక బాగా రుద్దాడు. వెచ్చని ఆ కుడిచేతి కరభ భాగాన్ని, కంటిపై ఒత్తాడు. తంగేడాకు తెచ్చి స్వామి తలమీద మెత్తాడు. రేచక నిమ్మఆకులు మెత్తగా నమిలి కంటిపై పట్టువేశాడు. తెల్లదింటెన పూవురసం కంట్లో విడిచాడు. పేరిన నేతిని వేశాడు. పెరుగు వత్తులు పెట్టాడు. చనుబాలతో శంఖాన్ని చాది, ఆ గంధం పూశాడు. ఇలా ఎన్నెన్నో మందులు తనకు తెలిసినవీ, ఇతరులు చెప్పగా వినివున్నవీ ప్రయత్నంతో తెచ్చి స్వామికి చికిత్స చేశాడు. లాభంలేకపోయింది. అడవిమందులు, ఊరిమందులు, అడిగి తెచ్చిన మందులు, ఎన్నో..ఎన్నెన్నో అందుబాటులో ఉన్న వన్నీ తెచ్చివేసినా వీసమంత గుణం కనిపించలేదు సరికదా, నీటికిబదులు కంటినుండి నెత్తురు కారడం ఆరంభమయ్యింది. తానుచేసిన చేతగాని వైద్యం వికటించినందువల్లే, నీటికిబదులు నెత్తురుకారుతున్నదని తిన్నడు విలవిలలాడిపోయాడు.

వేడిచేసి మనిషికి జ్వరం వస్తుందనీ, అలా వేడిచేసి వెచ్చగా అయిన ఒంటికి, వేడిచేసే మందులే వేయాలనీ, అప్పుడే జబ్బు నయ మౌతుందని పెద్దవాళ్లు చెబుతుండగా వినివున్నాడు కన్నప్ప. ఆ విషయం జ్ఞప్తికి వచ్చింది, ఇప్పుడు స్వామికి 'కంటిహాని' కలిగింది! ఈ కంటికి బదులు మరొక కన్నుపెడితే సరిపోతుందికదా అనుకున్నాడు. అవును. కంటికి కన్నే సరైనమందు. ఇక ఆలస్యం ఎందుకు? స్వామి కంటికి నా కంటిని అమర్చుతాను. బాద తీరిపోతుంది అనుకున్నాడు తిన్నడు.

అనుకున్నదే తడవుగా, తన అమ్ముల పొదిలోని వాడి బాణం తీశాడు. అప్పుడు తాను చేయబోయే సాహసం వల్ల, తన శరీరం కురూపమౌతుందని కానీ, ప్రాణంపోయినా పోగలదనికానీ ఆలోచించలేదు. బాణపు కొసను తనకంటి కొసనుపెట్టి క్షణంలో కనుగుడ్డును పెకలించి తీశాడు. తనకంట్లో నెత్తురు ధారగా వస్తున్నా లెక్కచేయలేదు. స్వామి కుడికంటిపై, తన కనుగ్రుడ్డుపెట్టాడు. ఆశ్చర్యంగా స్వామి కన్ను బాగయ్యింది. మునుపటి కన్నా  మెరిసిపోతున్నది.

## 19) 'తిన్నడు' రెండవ నేత్రదాత అయ్యాడు

శివునికి విష్ణువు తన పుండరీకనేత్రమిచ్చి, బదులుగా సుదర్శన చక్రాన్ని పుచ్చుకున్నాడని ముందే చెప్పుకున్నాం. ఇప్పుడు తిన్నడు తన కంటినిచ్చి, రెండవ నేత్రదాతగా మారాడు. రక్తం కారుతున్న శివుని కుడికంటిపై తిన్నడు తన 'కనుగుడ్డు' పెట్టగానే అది సహజంగా అతుక్కుపోయింది. ఉన్నకనుగ్రుడ్డు తీసి, ఆ స్థానంలో కొత్త కన్నుపెట్టే శస్త్రచికిత్స లాంటిదేదీ జరగలేదు. శివుడు 'భక్తుని పరీక్షకోసం చేసిన మాయ' అదైతే, భక్తుడు అమాయకత్వంతో చేసిన చికిత్స అది. శివునికన్ను మునుపటి కంటికంటే అందంగా ప్రకాశిస్తోంది.

కన్నప్ప ఆనందానికి అంతు లేదు. "స్వామీ! నన్ను కరుణించావా? నీ బాధతీరిందా?"..అంటుండగానే శివుని ఎడమ కంట, మునుపటిలాగే నీరు కారడం ప్రారంభమయ్యింది. కన్నప్పకు అర్థమయ్యింది. చిరునవ్వు నవ్వాడు. తనకన్ను ఇప్పుడు శివుని దివ్యనేత్రంగా మారింది . అందుకు తానెంతో ఆనందపడుతున్నాడు. ఇప్పుడు స్వామి ఎడమకంటినుండి నీరుకార్చడంలో అంతరార్థం అర్థమయ్యింది. తన ఉత్సాహం రెట్టింపయ్యింది. తన రెండవ కంటిని కూడ పెరికి పెడితే, ఇకపై స్వామి తన కళ్లతోనే లోకాలనన్నింటినీ చూస్తాడు. ఆ విషయం తలచుకోగానే తనువు పులకరించింది. ఈ నా రెండో కన్నేకదా స్వామి కోరుకొంటున్నది? లేకపోతే ఈ మాయ ఏమిటి? మొదటి కంటి జబ్బు బాగవగానే, రెండవదానికి వస్తుందా? ఇది స్వామి పరీక్షే లే. ఈ కంటి కెలాగూ నారెండవ కన్నుంది. వెంటనే పెరికి పెట్టేయగలను. కానీ, ఈ దేవునికి మూడోకన్నుకూడ ఉన్నదే. దానికేమైనా అయితే ఎలా? దానికీ ఉందినాదగ్గరే మందు. స్వామీ! ఇదిగో నారెండో కంటిని పెరికి పెట్టేస్తున్నా. మూడవ కంటికెలా పెడతావనుకుంటున్నావేమో! దానికి 'నాప్రాణం' పెట్టేస్తా!" అంటూ తన ఎడమ కంటిని పెకలింపబోతూ, కొంచెం ఆగాడు. స్వామి ఎడమకంటికే కదా నా ఎడమకంటిని పెట్టాలి. నా కన్ను పెరికాక, చూపు నాకుండదు కనుక ముందుగా స్వామి, ఎడమ కంటిని గుర్తుపెట్టుకుంటాను



అని, తనచెప్పుకాలిని స్వామి ఎడమకంటి కొసన గుర్తుగా తన్నిపెట్టాడు. మరుక్షణంలో తిన్నడు తన కంటిని బాణంతో గ్రుచ్చితీయబోతున్నాడు. అప్పుడు "ఆగు!ఆగు!" అంటూ పరమేశ్వరుడు ప్రత్యక్షమై బోయని చేయిపట్టి ఆపాడు. స్వామితో పాటు పార్వతీదేవీ ఉన్నది.

ఈ దృశ్యాన్నంతా శివుని వెనుక ఉన్న తపస్వి, బ్రాహ్మణభక్తుడు ఆసక్తిగా చూస్తూనే ఉన్నాడు. అతనిలో తనపూజను చెడగొడుతున్న 'అనాగరిక భక్తుడు' తనకు బద్ధశత్రువు అన్నభావనపోయింది! క్షణక్షణానికీ అతనిపట్ల గౌరవం పెరిగింది. తన పూజ చెడగొడుతున్నవాడు శారీరకంగా బలవంతుడు కనుక, తాను వానితో ఎదురెదురుగా తలపడలేనని, స్వామితో ముందే మొరపెట్టుకున్నాడు కూడ. అయినా అతనిపై పగతీర్చుకోవాలనే భావన కూడ అతనికి వచ్చింది. పూర్వం ఆ దేవునే ఒక సాలీడూ, (పాము అని ధూర్జటి చెప్పాడు. సాలీడని పాల్కురికి చెప్పాడు) ఏనుగూ మాలాగే విరుద్ధ ప్రక్రియలో పూజించి ఉండలేదా? బలహీనమైన చెలది (సాలీడు) ఏన్గు తలలోనికి దూరి దాన్ని చంపి తానుచావలేదా? అలాగే నా పూజ చెడగొడుతున్నమొరటు భక్తునితో నేను పోరాడి 'చావో-రేవో' తేల్చుకుంటాను అని భావించి వున్నాడు.

ఇప్పుడు తిన్నని భక్తితత్పరత చూచి, తన అభిప్రాయం తప్పని తెలుసుకున్నాడు. పార్వతీ పరమేశ్వరులు ఆ భక్తుని కోసం సాక్షాత్కరించినా ఆదిదంపతుల దర్శనభాగ్యం తనకూ కలిగించినందుకు తిన్ననిమీద శివబ్రాహ్మణునికి అమిత గౌరవం, భక్తీ, కృతజ్ఞతాభావం కలిగాయి.

## 20) కన్నప్పకు సన్నిధి చేసిన శివపార్వతుల అపూర్వదృశ్యం

శివునిచేయి కంటిని పెకలించుకోబోతున్న, వాడిబాణం పట్టివున్న కన్నప్ప చేతినిపట్టి ఆపింది! అదేక్షణంలో కన్నప్పకు ముందుకన్నాడ బెరుక్కొన్న స్థానంలో ఒకకొత్త కన్నువచ్చిచేరింది. అది సాక్షాత్ శివుని కన్నులాగే ఉంది కాబోలు! భక్తుని కంటిని తాను తీసుకొని భక్తునికి తనకన్ను బదులిచ్చినట్టున్నాడు

స్వామి. కన్నప్ప ధన్యుడు. ఎందుకంటే, ఆ కన్ను స్వామి, పూర్వం శ్రీమహావిష్ణువు నుండి తీసుకొన్నదే. ఇప్పుడది కన్నప్ప దయితే ఎంతగొప్పది?అతని కుడికన్నేకాదు. ఎడమకన్నుకూడ దివ్యంగా మెరిసిపోతున్నది. తన రెండు కళ్లనూ కన్నప్పకిచ్చి, స్వయంగా భక్తుని కళ్లతో తనవి మార్పిడి చేసుకున్నాడేమో సర్వేశ్వరుడు.

కన్నప్ప కళ్లలో ఆనందబాష్పధారలు ఆరంభం కాగా, శివుని కళ్లలో 'మాయ' కన్నీటిధారలు మాయమైపోయాయి. కన్నప్ప కళ్లలోని ఆనందబాష్పధారలు ఎలావున్నాయి? పూర్వం త్రిపురదానవులను చూచినపుడు శివుని కళ్లనుండి జారిపడ్డ బాష్పాల్లా ఉన్నాయి! భగవంతుడు భక్తునిపై దయారసం చిందిస్తే, భక్తునికంట ఆనందబాష్పాలకు కరవుంటుందా? ఆ సమయాన ఆకాశాన దేవతలూ, దానవులూ, ఋషులూ, మునులూ వచ్చినిలిచారు. దుందుభులు మ్రోయించారు. పూలవాన కురిపించారు. స్తుతులతో మెప్పించారు.

తన పూర్వాభిప్రాయాన్ని తొలగించుకొన్న శివబ్రాహ్మణుడు పరుగెత్తుకు వచ్చి కన్నప్పకు సాగిలపడి మ్రొక్కాడు.

**"తలప నీ సహజ ముగ్ధత్వమెరుగమి,**
**తలచితి నీ కహితంబు సేయంగ,**
**తప్పు సైరింపు కన్నప్ప! దయాత్మ!"**

అన్నాడు. నీవు సాక్షాత్తు శివుడవే నయ్యా! నీముగ్ధభావం నీమహిమ వేదాల్లో కానీ ఇతరత్రా కానీ చదువగా మరొకరిలో కనిపించదు. ముల్లోకాల్లో నీవంటి వాడుంటాడని విననూ లేదు.

**"బాపురే కన్నప్ప! పరమలింగంబ!**
**బాపురే కన్నప్ప! ప్రథమ విలాస!**
**నల్లవో కన్నప్ప! నాలింగ ముగ్ధ!**
**నల్లవో కన్నప్ప! నల్లనైనార!"** **(బసవ.పురా)**



అంటూ స్తుతించాడు భక్తతిన్నని. కన్నప్పకళ్లు శివుని కళ్లులాగే ప్రకాశిస్తుండటం చూచిన పార్వతీదేవి ఆశ్చర్యపోయింది. శివుడూ...కన్నప్ప....ఒకరి నొకరు సూటిగా కళ్లలో కళ్లుపెట్టి చూచుకుంటున్నారు. ఈ జంట కళ్లకు ఆ జంటసరి! ఈ కాంతులకు ఆ కాంతులు సరి! ఈ చూపులు ఆ చూపుల్లో కలిశాయి. రెండూ ఏకమై, చూడసొంపై ఉన్నాయి. ఆ యిరువురి కళ్లూ 'కవలల్లా' ఉన్నాయి. ఒక కొమ్మలోని రెమ్మల్లా, ఒకగుత్తిలోని పూవుల్లా ఉన్నాయి. శివుని నేత్రాల్లో దాగివుండి మొలచిన మొలకలా? లేక కన్నప్ప కన్నుల బీజాలా? కాక, శివుని కండ్ల పండ్లా? అన్నభ్రమకొలుపుతూ...ఇరువురి కళ్ల 'స్నేహ' 'సారూప్యాలు' ప్రకాశమాన మౌతున్నాయి.

భగవంతుని దయతో 'భక్తుడే దేవుడు' కాగలడు. శివభక్తులు శివస్వరూపులేకదా! 'కన్నప్ప' దాతలా కన్నిస్తే, స్వామి ప్రతిఫలంగా కన్నప్ప నేత్రాలను 'తననేత్రాల్లా దివ్యములూ, భవ్యములూ అయ్యేట్టు అనుగ్రహించాడు. ఇప్పుడు స్వామి అగ్నినేత్రం చల్లబడినట్టూ, దాని క్రింద ఉన్న రెండు కళ్లూ కన్నప్ప అమాయకపుకళ్లు కాగా, స్వామి నిజనేత్రాలతో కలిపి నాలుగు కళ్లున్నట్టు తోస్తున్నది! ఆ కళ్లలో శాంతీ, ఔదార్యమూ ఉన్నాయి. ఈ గుణాలే స్వామి నొసటికంటి తీవ్రతను కప్పేశాయి. కనుక ఇకపై ఆ మూడవ నేత్రం ఎవరినీ మండించదనీ, దాన్ని చూచి ఎవరూ భయపడరనీ కవి చమత్కరించాడు. అందుకు కొన్ని ఐతిహ్యాలూ పేర్కొన్నాడు.

## 21) కన్నప్ప కంటితో భవుడు భవ్య దయ్యాడట!

ఎలా చమత్కరిస్తారో చూడండీ కవులు! "స్వామీ! ఇప్పుడు నీశక్తి నశించింది. కనుక నీవిపుడు తీవ్రంగా చూచినా మరొకసారి త్రిపురాలు మండిపోవు. మరొక మన్మథుడు మాడిపోడు. యముడు క్రమం తప్పినా నీవు దండింపలేవు. ప్రళయంలో లోకాలను నాశనం చేయలేవు. కన్నప్ప నీకిచ్చిన దయాసమగ్రమైనకళ్లు, నీకుముందే కనుక ఉండివుంటే, 'ఉగ్రాక్షుడు' అనే పేరు నీకు వచ్చేదికాదు. ఇలాంటి కళ్లుండి వుంటే నిన్ను 'సుందరు'డనే పిలిచేవారు.

కన్నప్ప తాకడం చేతనే నీవు సంపన్నుడి వయ్యావు. ఎలాగంటావా? అతని పాదరక్షతాకడం చేత 'భక్తవత్సల' బిరుదం నీకు వచ్చింది. ఆ చెప్పు తాకినందు వల్లనే, నీ నెత్తిన చంద్రునికి 'దోషాకరుడు' అనే చెడ్డపేరు పోయింది. అతడు లోకాల్లో అభివంద్యుడూ, 'ఆహ్లాదకరుడు'గా గణింపబడ్డాడు, 'గంగకు' ఆ పాదరక్ష తగిలింది. అందుకే అది పవిత్ర తీర్థమయ్యింది. ఈ పాదరక్ష 'బ్రహ్మం' అని తెలిసివుంటే, విష్ణువుతో పందెం వేసిన బ్రహ్మ ఎలాగో కష్టపడి అప్పుడే ఈ కన్నప్ప చెప్పుతాకిన శివశిరః స్థలాన్ని 'దర్శించి' ఉండేవాడు. కన్నప్ప 'నిర్మాల్యం' వల్లనే శివుడు నిర్మలదేహు డయ్యాడు. ఈ భక్తుని పుక్కిటినీటి అభిషేకంతోనే స్వామి అతిలోకు డయ్యాడు. ఈ భక్తుని ప్రసాదం స్వీకరించడంవల్లనే. స్వామి వేదశాస్త్ర వివేకాన్ని అధిగమించాడు. భక్తుని ఎంగిలి తిన్నందువల్లనే 'శివుడు' 'విధినిషేధాతీతుడు' అయ్యాడు."

**"లింగంబు కన్నప్ప ఎంగిలికాన**
**అంగమంతయు ఉత్తమాంగమయ్యె!"**

'ఉత్తమాంగము' అంటే 'తల' ఒక్కటేకదా? శివలింగంలో ఉత్తమ అవయవమనేది లేదు. సర్వమూ శ్రేష్ఠమే. దానిక్కారణం తిన్నని ఎంగిలి లింగమంతా తగిలింది కనుక. ఇలా కన్నప్ప చూపిన భక్తిని స్వామి ఆనందంగా అందుకున్నాడు. దీనిని వేదబాహ్యమనే వారికి శివపూజలోని రహస్యం ప్రత్యేకించి కన్నప్ప వృత్తాంతంలోని పరమార్థం తెలీదు. దానికి నిదర్శనం స్వామి ప్రత్యక్షమైనపుడు తిన్నడు ప్రదర్శించిన వివేకమూ, వినయమూ, ముందుచూపే!

## 22) శివుని అనుగ్రహాన్ని తిన్నడెలా స్వీకరించాడు?

పార్వతీ సమేతంగా లింగమధ్యం నుండి శివుడు ప్రత్యక్షమై సాహసించి తనరెండవ కంటిని పెకలించబోతున్న తిన్నని చేయిపట్టి ఆపాడు. ఆదృశ్యాన్ని స్వామి వెనుక నున్న బ్రాహ్మణ భక్తుడూ చూచాడు. ఆకాశంలో దేవతలూ,



మునులూ దర్శించి పూలవాన కురిపించారు. తిన్ననికి ఆశ్చర్యం, ఆనందమూ కలిగాయి కానీ అతడు భయపడలేదు. ఎప్పుడో విడిపోయిన తల్లిదండ్రులను చేరుకొన్న ఆనందం కలిగింది. ఆదరంగా 'నీకేమికావాలి నాయనా!' అన్న పరమేశ్వరుని మాటకు బదులివ్వగల చనవు ఆ భక్తునికి లభించింది! స్వామి దర్శనంతోనే అతనిలోని అజ్ఞానావరణం విచ్ఛిన్నమైపోయింది. వివేకం వెల్లివిరిసింది. వినయంగా అన్నాడిలా. "స్వామీ! నాకు కావలసిందేమో నాకేమి తెలుసు? కోరికంటే ఏమో తెలియదు. మోక్షమంటేనూ తెలియదు. నేనేమి కోరుకోవాలో నాకు తెలియనే తెలియదు" అన్నాడు. అయితే అతనికి తెలిసిందేమట?

"ఎరుగుదు, ఎరుగుదు, ఎరుగుదు మరియు, మరియు, మరియు ముమ్మాటికి నిన్ను..." అన్నాడు. నిన్ను... కేవలం నిన్నుమాత్రమే నేనెరుగుదును. ఇంకేమి ఎరుగను అంటాడు. చాలదా దేవుని స్వరూపాన్ని తెలిసినవానికి ఇంకేమితెలియాలి? అన్నీతెలిసినట్టేకదా? "నీమీద అనురక్తి, ఎప్పటికీ, ఎప్పటికీ, బలహీనపడకుంటే చాలు" అన్నాడు సంగ్రహంగా. ఎంత వివేకమది!

వివేకవంతుడూ, వేదవిజ్ఞానం కలమహాపండితుడూ, భక్తుడూ అయిన బ్రాహ్మణభక్తుడూ చేతులు జోడించి శివపార్వతుల ముందు భక్తిప్రపత్తులతో నిలుచున్నాడు. స్వామి ఆ భక్తునితో "తపస్వీ! చూచావా నేను వేదేతర పద్ధతిలో పూజిస్తున్న కిరాత భక్తుని పూజను ఎందుకు అంగీకరిస్తున్నానో అర్థమయిందికదా? ఈ సృష్టిసర్వమూ నాదే. ఇందులో నేను ఇష్టపడనిదీ, ఈసడించేదీ ఏదీ వుండదు. భక్తులు తమకు ఇష్టమైన వానినే నాకు సమర్పిస్తుంటారు. వారికి అందుబాటులో ఉన్నదానినే నాముందు పెట్టి 'సమర్పయామి' అంటుంటారు. అందులో స్వీకరింపదగిందీ, తిరస్కరింపదగిందీ ఏమీవుండదు. నేను స్వీకరించేది భక్తినే; శ్రద్ధనే; అర్పణనే; సేవనే! ధనవంతుని వైభవోపేతమైన విలువైన అలంకారాలూ, కానుకలూ నన్ను ప్రలోభపెట్టలేవు. తమ కోరికలు నెరవేరితే నాకు ఏవేవో సమర్పిస్తామని చెప్పడం అవివేకం.

నాకొరకే నన్నుకొలిచే వారంటే నాకిష్టం" అని స్వామి శివబ్రాహ్మణునికి లోకరీతినీ, భక్తుల లోభత్వాన్నీ తెలియజేశాడు. ఆ భక్తుడు కూడ కన్నప్పకోరినట్టే. తనకు శివభక్తి మాత్రమే కావాలని వినయంగా పలికాడు.

ఆ భక్తులిద్దరినీ పరమేశ్వరుడు ఆదరంతో తన చెంతకు ఆహ్వానించాడు. అక్కున చేర్చుకున్నాడు. అగ్నిరూపుడూ, అష్టశరీరుడూ, శ్రీకాళహస్తిలో వాయులింగేశ్వరుడై వెలుగుతున్న కరుణామయుడూ నిజభక్తులిద్దరినీ తనదరిని చేర్చుకోగానే, జ్ఞాన ప్రసూనాంబగా పిలువబడుతున్నదీ, 'భృంగముఖరాలక' అనే నిజనామం కలదీ, (స్కందపురాణానుసారం ఈ దేవేరి పేరు భృంగ ముఖరాలకే) అయిన పార్వతీమాత వాత్సల్యంతో దీవిస్తుండగా, శివపరివారం 'జయజయ' ధ్వానాలతో 'హరహర మహాదేవ' ఘోషలతో ఆ భక్తద్వయాన్ని కీర్తిస్తుండగా స్వామి తన అనంతశరీరంలోనికి వారిని ఆహ్వానించి లీనంచేసుకొని అపురూపమైన అనన్య సామాన్యమైన 'సాయుజ్యమోక్షమిచ్చి' తిన్ననీ, శివబ్రాహ్మణునీ శాశ్వత కీర్తిమంతులను కావించాడు. దేవతలు తమ హర్షాతిరేకాన్ని. దివ్యకుసుమాలు కురిపిస్తూ, దివినుండి ఆశీర్వదించారు.

## 23) తిన్నని లాంటి మరికొందరు ముగ్ధభక్తులున్నారు.

ఇదీ 'తిన్నడు' లేక 'కన్నప్ప' లేక 'కన్నప్పదేవుడు' అనబడే ముగ్ధశివభక్తాగ్రణి పవిత్ర గాథ. నాయనార్ల స్థానాన్ని అలంకరించిన అరవై ముగ్గురు భక్తుల్లో 'తిన్నడు' అగ్రగణ్యుడు. అలాగే 'ముగ్ధసంగయ్య' అనబడే భక్తుడు, బసవేశ్వరుని కాలంలో, అమాయకుడై ఒక వేశ్యయింటికిపోయి ఆమె స్తనాలజంటనే ప్రాణవంతమైన శివలింగాలని పూజించాడు, 'నాట్యనమిత్తండి' యనే మరొక భక్తుడు చిదంబరంలోని నటరాజ స్వరూపాన్ని చూచి స్వామికేమయ్యిందని పూజారి నడిగాడు. అతడు పరిహాసానికి 'వాయురోగం వచ్చింది' అని చెప్పగా ఆరోగ్యానికి మందు తయారు చేయుమని పూజారికి తన ఆస్తి నమ్మిన సొమ్మంతా ధారబోశాడు. చివరకు 'నటరాజు' దర్శనభాగ్యం పొంది నటరాజ స్వరూపంలోని శివతత్త్వరహస్యాన్ని స్వామినుండే విన్నాడు.



అలాగే 'దీపకళియారు' అనేభక్తుడు స్వామికి నిత్యం దీపోత్సవంను చేసే వ్రతంలో ఆస్తులు కోల్పోయి చివరకు తన జుట్టునే అంటించుకున్నాడు. శివుని మన్నన పొందాడు. మరొకభక్తురాలు 'బెజ్జమహాదేవి' ఉన్నది. ఆమె శివుణ్ణి తనబిడ్డగా భావించి, లాలించి తరించింది. శివునికి అమ్మ నాన్నలేరనీ, 'అనాథ'అనీ ఎవరో చెప్పిన కథ వినిన ఆ భక్తురాలు శివుని తనబిడ్డగా భావించిన ముగ్ధభక్తురాలు. అలాగే శివాపరాధం చేశాడని నిమ్మవ్వ అనే ముగ్ధ 'భక్తురాలు' ఒక్కగాను ఒక్కడైన తన కొడుకునే చంపి ఆపై శివుడని తెలియకున్నా అతిథిగా వచ్చినతనికి వడ్డించింది. సిరియాళ బాలునిలాగే స్వామి ఆమెబిడ్డను బ్రతికించి ఆమెకు ముక్తి నిచ్చాడు. అలాగే 'ధూపవ్రతంలో' సర్వస్వంకోల్పోయిన 'కలయనాయనారు' తనభార్యతాళిని అమ్మి, 'ధూపవ్రతం' పూర్తిచేశాడు. అతనికి స్వామి సంపద యిచ్చినా, శివపూజ మానలేదు. అతడే తిరుప్పనందాళ్ గ్రామంలోని 'శడప్పరు' పేర పూజింపబడుతున్న శివలింగం, ప్రక్కకు వ్రాలిపోగా రాజుగారు ఏన్గులతో లాగించినా చక్కగా నిలబెట్టకున్న తరుణంలో తన మెడకు దర్భదారం కట్టుకొని చక్కగా నిలబెట్టిన అమాయక భక్తశిఖామణి! 'రుద్రపశుపతి' అనబడే మరొక అమాయక భక్తుడు శివుడు విషం మ్రింగాడని ఒకకథకుడు గుడిలో చెప్పడం విని స్వామి దగ్గరకు వెళ్లి ఆ విషం ఉమ్మివేయుమని, 'హఠం' చేసి స్వామి ఒడిలో కూర్చున్నాడు తనకంఠానికి వాడి ఖడ్గం ఆనించుకొని; ఉమ్మకపోతే ఆత్మహత్యచేసుకుంటానని. అలాగే శివునితో పాలు త్రాగించిన 'గొడగూచి అనే బాలిక చివరకు శివలింగంలో లీనమైపోయింది. ఇవన్నీ అమాయక భక్తుల దృఢభక్తిని తెలిపే కథలు. కరుణామయుడై మూగజీవులకు మోక్షమిచ్చిన శ్రీకాళహస్తీశుడు తిన్నని వంటి ముగ్ధభక్తుని తనలో చేర్చుకోవడంలో ఆశ్చర్యపడవలసిందేమున్నది? అయితే ఈ భక్తుడు పూర్వజన్మ సుకృతంగా తెచ్చుకొన్న భక్తిరహస్యమేమి?'

## 24) తిన్నని పూర్వజన్మవృత్తాంతం.

ద్వాపరయుగంలో భూభారాన్ని తగ్గించడానికోసం శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణపరమాత్మగా జన్మించాడు. అతడే మహాభారత యుద్ధానికి ప్రేరకుడూ, నిర్వాహకుడు కూడ. మహాభారతం కౌరవ పాండవుల కథగా ప్రసిద్ధం. కాని,

ఆ మహాగ్రంథం ఒక ఇతిహాసం. ఒకపురాణం. ఒకనీతిశాస్త్రం. ఒకధర్మశాస్త్రం. ఒకరాజనీతిశాస్త్రం. అన్నిటికన్నమించి అది శ్రీకృష్ణకథ!'

శ్రీమహావిష్ణువు అనేకావతారాల్లో 'దశావతారాలు' ముఖ్యాలు. అందులో మానవధర్మ నిర్ణాయకమైన అవతారాలు రెండు. మొదటిది మర్యాదా పురుషోత్తమునిగా, శ్రీరామచంద్రునిగా స్వామి అవతరించడం. మానవుడు ఆచరింపదగిన ధర్మాలను స్వయంగా శ్రీరామచంద్రుడై, ఆచరించి చూపినందువల్ల ఆయన మర్యాదా పురుషోత్తము డయ్యాడు. ఆ అవతారంలో స్వామి ద్వాదశకళాపరిపూర్ణుడై ఉన్నాడు. కనుక దైవత మహిమా విభూతులు ప్రదర్శింపకుండ ఉత్తమ మానవుడై, పాలకుడై, ఆదర్శపుత్రుడై, ఆదర్శభర్తయై, ఉత్తమసోదరుడై, ప్రేమాస్పదుడైన ప్రభువై, రావణాది రాక్షసులకు యముడై, విభీషణ సుగ్రీవాదులకు మిత్రుడై, శ్రీహనుమదాదులకు ఆరాధ్యుడై వెలుగొందాడు.

శ్రీకృష్ణుని అవతారం పరిపూర్ణమైంది. పదహారు కళలతో అద్భుత, మహిమలతోకూడినది. కారాగారంలో జన్మించింది మొదలు గోకులంలోచేరి, బాలబ్రహ్మంగా బహులీలలు చూపినవాడు ఆ స్వామి. కంసాదులను చంపాడు. నరకాసురాదుల నుండి మానహానిపొందిన మహిళలను రక్షించాడు. తాను క్షత్రియ తేజం చూపినా పాలకుడు కాలేదు. ఆనాటి రాజుల దుష్టపాలనను అరికట్టి, ధర్మపాలన స్థాపించడానికి ఎన్నో కొత్త ప్రమాణాలు నిర్దేశించాడు. ఆయన బంధువులను నెత్తిన పెట్టుకోలేదు. బంధాల్లో చిక్కుకోలేదు. తాను జన్మించిన యాదవకులం నాశనమౌతున్నా, అడ్డుకోలేదు. పెంచి, ప్రేమపంచిన యశోదానందులనూ, చిన్ననాటి నేస్తాలనూ, గొల్లపల్లెనూ మమకారం త్రుంచేసుకుని విడిచిపెట్టిపోవడానికీ వెనుకాడలేదు. ఆ స్వామి ఎవరు? ఎన్నియుగాల్లో, ఎన్నికల్పాల్లో ఏమేమి చేయలేదు? నరనారాయణుల్లో నారాయణు డాయనే కదా! అప్పటి జతగాడే అర్జునుడుగా, పాండవ మధ్యముడుగా మహాభారతంలో శ్రీకృష్ణసఖుడుగా మనకు దర్శనమిస్తాడు.



అర్జునునికి తన సోదరి సుభద్రనిచ్చినందువల్ల అతనికి బావయ్యాడు. పాండవుల తల్లి తనకు మేనత్త అయినందువల్ల పాండవులకు 'బావ' అయ్యాడు. ఇలా పాండవులతో బాంధవ్యబంధం ఉండగా, స్వామికి కౌరవులతోనూ విడరాని బాంధవ్యమే ఉంటుంది కాని లేకుండ ఎలాపోతుంది? అయినా స్వామి, 'పాండవ పక్షపాతి' గా పేరు పడ్డాడు, నిజమే! ధర్మం ఎటువైపున ఉంటే స్వామి అటువైపున ఉంటాడు.

ద్వాపరంలో భరతఖండంలో జనాభా చాల ఎక్కువైనట్టే దుష్టపాలనా ఎక్కువయ్యింది. ధర్మక్షేత్రంగా పేరుపడ్డ కురుక్షేత్రంలో పద్దెనిమిది అక్షౌహిణులసైన్యం పాల్గొనింది. దుర్యోధనునివైపు పదకొండు. పాండవులవైపు, ఏడక్షౌహిణుల సైన్యం పాల్గొనింది. ఆ యుద్ధానికి ముందు ఇరుపక్షాలవారూ తమకు తోడ్పడేరాజులను అర్థించి, తమపక్షాన చేర్చుకున్నారు. శ్రీకృష్ణుని కోరిన దుర్యోధనుడు కూడ ఆతని పక్షంలోని పదివేలమంది మహావీరులనూ, కొంతసైన్యాన్నీ తీసుకున్నాడు. ఇరుపక్షాలవారూ సామాన్యంగా యుద్ధంలో ఉపయోగపడే శస్త్రాలేకాక దివ్యమైన అస్త్రాల సంపాదనప్రయత్నమూ చేశారు.

దుర్యోధనునివైపు అతనిస్నేహితుడుగా కొంత రాజ్యాన్ని బహుమతిగా పొందిన రాజహితుడుగా ఉండిన 'కర్ణుడు' ఒక సర్పముఖాస్త్రాన్ని దినానికి పుట్టెడు పాలుపోసిపెంచి దాచుకున్నాడు. అతనివద్ద పరశురాముడు ప్రసాదించిన దివ్యాస్త్రా లున్నాయి. ఇంద్రుడు అతని కవచకుండలాలు తీసుకొన్నప్పుడు ప్రసాదించిన 'శక్తీ' ఉన్నది. ఇంకనూ దుర్యోధనునివైపు భీష్మపితామహుడూ, ధనుర్విద్యాగురువు ద్రోణుడూ, రుద్రాంశతో జన్మించినవాడుగా చెప్పబడుతున్న అశ్వత్థామాదులున్నారు. వారినెదుర్కొని విజయం సాధించాలంటే విజయునికి ఒక్కనికే సాధ్యం. అందుచేత కృష్ణుడే అర్జునుని ప్రేరేపించి శివునిగూర్చి తపస్సు చేసి పాశుపతాస్త్రం సంపాదించడానికి పంపించాడు. 'పాశుపతం' లభిస్తే, ఎలాంటి పరిస్థితుల్లోనైన, పాండవులే విజయం సాధించగలరు. కురుక్షేత్ర యుద్ధంలో శ్రీకృష్ణుడు ఆయుధం పట్టకుండ కేవలం మాటసాయంచేస్తూ

ఉంటానన్నాడు. అర్జునుడు “ ఆ సాయమే మాకు చాలు. నాకు రథసారథిగా మాత్రం ఉండు” అన్నాడు.

అలా ఓటమి ఎరుగని అర్జునుడు ‘విజయుడు’ అనే సార్థకనామంకల పాండవమధ్యముడు రథికుడుగా, విశ్వకార్యనిర్వహణకు సారథియైన శ్రీకృష్ణపరమాత్ముడు ఆతని రథసారథిగా సంగ్రామకార్యం నిర్వహించారు. వారు సనాతనులైన సావాసకాండ్రు. ‘నర నారాయణులు.’ శరీరాలు వేరైనా ఆత్మలు ఒకటిగా, ఆదర్శాలొకటిగా ఉండినవారు. ఆ యుద్ధంలో ధర్మరాజు వేయించిన లెక్కప్రకారం మొత్తం మరణించిన వారిసంఖ్య డెబ్బది ఆరుకోట్లు ఆ యుద్ధంలో సాధారణ సైనికులేకాదు. మానవయోధులే కాదు గంధర్వులూ, రాక్షసులూ, నాగులూ, మరెందరో దివ్యలూ, దివ్యమానవులూ పాల్గొన్నారు. అలాంటి యుద్ధంలో మంత్ర ప్రాధాన్యమున్న అస్త్రాల అవసరం ఉంది. కనుకనే కృష్ణపరమాత్మ అర్జునుని పాశుపతాస్త్రంకోసం తపస్సుకు పంపాడు. శివుడు అందరి భక్తులను పరీక్షించినట్టే అర్జునునికూడ పరీక్షించాడు. శివపార్వతులు కిరాత దంపతుల్లా వచ్చారు. ‘ప్రమథగణాలు’ బోయలుగా ‘మూకాసురుడు’ పందిగా వచ్చారు. నాల్గువేదాలూ వేటకుక్కల రూపంలో వచ్చాయి. అలావచ్చిన శివుడు అర్జునుడు తపస్సు చేస్తున్న ప్రాంతానికి పందిరూపంలో ఉన్న ‘మూకాసురుణ్ణి’ పంపాడు. వాడు విజయుడున్న తపోభూమి ఇంద్రకీలాద్రికెళ్లి గడబిడ సృష్టించాడు. తపోదీక్షలో ఉండినా అర్జునుడు ‘క్షత్రియుడు’ కనుక హాని జరుగుతున్నచోట అడ్డుపడి రక్షింపవలసిన బాధ్యత తనకున్నదని అతనికి తెలుసు. పరిసర మునివాటికల్నీ మునిజనాన్నీ అమాయకుల్నీ బాధకు గురిచేస్తున్న ‘మాయ అడవిపందిని’ మట్టుపెట్టడానికి నిశ్చయించుకొన్నాడు ఫల్గునుడు. విల్లు అమ్ములు చేపట్టి పందిని తరుముతూ వెళ్లాడు. ఆ పంది నానాదారుల్లో పరుగులుతీసింది. విజయుని నానా తిప్పలుపెట్టింది. చివరకు పరుగులో ఉన్నపందిని గురిచూచి కొట్టగా, ఫల్గుణుని బాణం పందికి గుచ్చుకొని గిరగిరా తిరుగుతున్నది. అదేక్షణంలో అవతలి నుంచి మరోబాణం వచ్చింది.



ఆ పందికి మరోవైపు గుచ్చుకుంది. పంది ముందు సవ్యంగా తిరుగుతుండినది, అపసవ్యమార్గంలో తిరిగింది. చివరకు ప్రాణాలు విడిచింది.

పందికోసం శివుడూ, అర్జునుడూ పోరాడవలసి వచ్చింది. నేను కొట్టాను ఈ పందిని అని అర్జునుడంటే, కిరాతుడుగా ఉన్నశివుడు దీన్ని ముందుకొట్టినవాడ్ని నేనే. కనుక ఈ పంది నాదే అన్నాడు. వారిమధ్య మాటలతో ఆరంభమైన యుద్ధం మహాస్త్రాల ప్రయోగందాక వెళ్లింది. అర్జునుని అస్త్రశస్త్రాల నన్నింటినీ వమ్ముచేశాడు మాయాకిరాతుడు. చివరకు శివునితో మల్లయుద్ధమూ చేశాడు అర్జునుడు. ఆ యుద్ధంలోనూ కిరాతుని మించలేక పోయాడు. అసహనంతో తన ధనువు అల్లెత్రాటిని వదులుచేసి ధనుర్దండాన్ని ‘దుడ్డుకర్ర’లా చేసి కిరాతునిపై దాడిచేశాడు విజయుడు. కడకు కోపం ఆక్రోశం ఆపుకోలేక ‘కపర్ది’ తలమీద గట్టిగా కొట్టాడు.

పరీక్ష పూర్తయ్యింది. పరమశివుడు ప్రత్యక్షమయ్యాడు. అంతదాక పోరాడి తాను బాధించింది. పరమేశ్వరుణ్ణేనని తెలిసిన ‘ధనంజయుడు’ భయంతో వణకిపోయాడు. భక్తితో స్వామి పాదాలమీద వ్రాలిపోయాడు. స్వామి చిరునవ్వుతో లేవనెత్తాడు. ఎఱుకసాని స్థానంలో ‘పార్వతీదేవి’ ఉన్నది. శివుని వెంట పరివారంగా వచ్చిన ప్రమథగణాలు తమ నిజరూపాలలో అర్జునునికి దర్శన మిచ్చారు. విజయుడు ఆదిదంపతులను స్తుతించి వినమ్రుడై నిలిచాడు.

స్వామి ఆదరంగా అర్జునుని వరం కోరుకొమ్మన్నాడు. విజయుడు పాశుపతాస్త్రం ప్రసాదించమన్నాడు. స్వామి మరొక వరం కోరమన్నాడు. భక్తుడైన అర్జునుడు తనకు ఆ జన్మలోనే ముక్తికావాలన్నాడు. ఆ రెండు కోర్కెల్లో మొదటిదైన పాశుపతాస్త్రాన్ని శివుడు అనుగ్రహిస్తూ “ఇది నీకు ఒక్కసారికే పనికి వస్తుంది. ఒక్కసారి నీవు ప్రయోగించాక ఇది నావద్దకు వచ్చి చేరుకుంటుంది” అన్నాడు. ఇక ముక్తికావాలనే కోర్కె ఆ జన్మలో తీరదన్నాడు. ఎందుకంటే ‘బంధువధ’ కోసం తననుండి అస్త్రం అర్థించినందువల్ల, ముక్తికోసం మరొక జన్మవరకు

ఆగాలని సెలవిచ్చాడు స్వామి. మరుజన్మలో అర్జునునికి కిరాతజన్మ లభిస్తుందనీ ఆ జన్మలో శివభక్తి కలిగి తనను వేదేతర పద్ధతిలో పూజించి మెప్పించి సాయుజ్యమోక్షం పొందగలవని సెలవిచ్చాడు. అందుచేతనే అతడు 'తండ్రి' గర్భంలో ఉండగానే శివభక్తిని సొంతం చేసుకున్నాడు. పుట్టి ప్రత్యేక నడతలో కిరాత బాలుడుగా ప్రవర్తించాడు. కడకు ముక్కంటికి కన్నిచ్చి కన్నప్ప దేవుడుగా ప్రసిద్ధుడయ్యాడు. అతని కులాచారం కానీ పూజా విధానంకానీ స్వామి దృష్టిలో నిషేధం కాదు. కాలేదు. అదే శివభక్తిలో ఉన్నరహస్యం.

## 25) కన్నప్ప శివునికి నైవేద్యంగా పెట్టిన జంతువుల పూర్వజన్మవృత్తాంతం!

'కన్నప్ప' శివునికోసం వేటాడి తెచ్చిన మాంసం కాల్చి రుచిచూచి స్వామికి తినిపించేవాడనీ ఆ కసుమాలపు పూజను బ్రాహ్మణ భక్తుడు 'వేదేతర' పూజగా భావించి తిట్టుకొంటూ ఆ కల్మషాన్ని తొలగించి తాను శాస్త్రోక్తంగా పూజించేవాడనీ చెప్పుకున్నాం. తిన్నడు శివుని మాంసపు మరకలతో, ఎంగిలి చారలతో మలినంచేస్తే, తాను పంచామృత స్నపనం చేసి శివుని మందిరాన్ని అలికి, పూసి, ముగ్గులువేసి శ్రద్ధగా సేవించి వెళ్లేవాడని చెప్పుకున్నాం. ఆ రెండు మార్గాల పూజలనూ శివుడు సంతోషంగా స్వీకరించాడు. అంగీకరించాడు. ఎందుకు? ఇద్దరూ చిత్తశుద్ధికల భక్తులే కనుక.

అయితే జంతుహింస చేసి ఆ మాంసాన్ని శివునికి పెట్టడం విడ్డూరం అనిపిస్తుంది. దీనికి సమాధానం పాల్కురికి సోమనాథకవి తన బసవ పురాణంలో ఇచ్చివున్నాడు. పూర్వం జీమూతవాహనుడనే గంధర్వుడు పాముల జాతిని కాపాడటంకోసం తనదేహాన్ని గరుత్మంతునికి ఆహారంగా బలిపీఠంపై ఉంచాడు కదా! అప్పటి కతడు కొత్త పెండ్లికొడుకే. అలాగే, 'శిబిచక్రవర్తి' ఒక పావురాన్ని కాపాడటంకోసం తన శరీరాన్ని పణంగాపెట్టి దానవీరుడనే శాశ్వతకీర్తి సంపాదించుకున్నాడు. కీర్తిముఖుడు శివుని ఆజ్ఞప్రకారం ఆకటికి తనదేహాన్నితానే ఆరగించాడు. అతని తలమాత్రమే మిగిలింది. స్వామి అతణ్ణి కరుణించి ఒక గణాధిపతిని చేశాడు. అంతేకాక శివాలయ ప్రథమ ద్వారాలపై వెలసి



ప్రథమపూజలు అందుకుంటున్నాడు కూడ! అలా నిజదేహాలను నైవేద్యంగా సమర్పించిన సంఘటనలు ఎన్నో ఉండగా తిన్నని మాంసనైవేద్యం మాత్రం ఎందుకు అపవిత్ర మవుతుంది అంతేకాక? ఈ మాంసనైవేద్యం శివుని ఆజ్ఞప్రకారమే ఆయన ఇచ్చిన 'వరం' కారణంగానే సమర్పించబడింది. దాని పూర్వవృత్తాంతం ఇది.

ఒకప్పుడు సుందర శరీరంకల రాక్షసులు కొందరు శివుని గూర్చి తపస్సు చేశారు. కొంతకాలానికి శివుడు కరుణించి వారికి దర్శనమిచ్చాడు. "ఏమికోరి తపించారు చెప్పండి. మీకు కోరిన వరం ప్రసాదిస్తాను" అన్నాడు స్వామి. అంతేకాదు "మీరు నన్ను మెప్పించారు. కనుక కోరుకొంటే విష్ణుపదవి, బ్రహ్మపదవి, ఇంద్రాది పదవులైనా ప్రసాదిస్తాను"అన్నాడు. అందుకు వారు అవేవీ అక్కరలేదన్నారు. "స్వామీ! మారాక్షసుల్లోని జలంధరుడు 'సగౌరవంగానే' తీసుకొన్న విష్ణుపదవి మాకేల? మా 'గజాసురునిచేత చచ్చిన' బ్రహ్మపదవి మాకెందుకు? మా 'తారకాసురుని' చేత తరిమి కొట్టబడ్డ 'ఇంద్రపదవి' మాకు వద్దేవద్దు. అలాకాక మారాక్షసుల్లోనే 'వ్యాఘ్రుడూ', 'అంధకుడూ' మొదలైనవారు, నీతో విరోధించి చచ్చి కైవల్యంపొందారు. అలా వచ్చే కైవల్యంకూడ మాకు వద్దు. అందులో చిత్రమేముంది? మా యీ సుందర శరీరాలను నీవు నేరుగా తిని మాకు మోక్షం ప్రసాదించు. ఇదే మా కోర్కె" అన్నారట! అందుకు స్వామి "అయితే మీరు మీ శరీరాలను చాలించి శ్రీకాళహస్తి సమీపంలోని అడవుల్లో, వివిధ జంతువులై పుట్టండి. అప్పుడు మిమ్మల్ని 'కన్నప్ప' అనే కిరాత భక్తుడు చంపి మీ మాంసాన్ని నాకు సమర్పిస్తాడు. అలా మిమ్మల్ని నేరుగా కాకపోయినా మీ దేహాల మాంసాన్ని స్వీకరించి మీరుకోరిన ముక్తిని ప్రసాదిస్తాను" అని సెలవిచ్చాడట. ఆపై రాక్షసులు తమ స్త్రీజనంతోపాటు, శ్రీకాళహస్తి సమీపాన ఉన్న కైలాసగిరిఅడవుల్లో నానావిధ జంతువులైపుట్టి కన్నప్పరాక కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఇతర వేటగాండ్రకు కానీ క్రూరజంతువులకు కానీ వారు అగుపించలేదు కన్నప్ప రాకకోసమే ఎదురు చూచాయి. పరమయోగుల్లా ఆ జంతువులు!

శివుని ఆకలి తీర్చడానికి బయలుదేరిన కన్నప్పకు తమంత తాముగా సమీపించాయి. ఆతని బాణపువేటు 'నెపంతో' అత్యంత సులభంగా ఆ భక్తునికి చిక్కాయి. స్వామి ఇచ్చిన వరాన్ని అనుసరించే ఆయనకు ఆహారంగా దక్కాయి. ఆ సుందర దానవులు తాము కోరుకొన్న కోర్కె తీర్చుకుని ముక్తిపొందారు. వారి తపస్సు పుణ్యమా అంటూ తిన్ననికి కూడ పూర్వపు భక్తుల దేహార్పణలో భాగమూ దక్కింది. స్వామి 'భక్తునికోసం' భక్తులకోసం సువర్ణముఖరీ నదీతీరాన వాయులింగేశ్వరుడై స్థిరవాసుడై వెలసి ఉన్నాడు. కన్నప్పను కూడ తననలా కొలువుమని సంజ్ఞచేసినట్టు, ఆ భక్తుని తనచెంత పర్వతాగ్రాన చేర్చి గౌరవిస్తున్నాడు. ఒకప్పుడు కన్నప్ప సేవించిన పుక్కిట బట్టి స్వామిని అభిషేకిస్తున్న పుణ్యనదీ జలమే ఇప్పుడు స్వామిని అభిషేకిస్తున్నది. పూజారులు కన్నప్పను పూజించాకే స్వామిని అర్చిస్తారు.

**"నిక్కంబు కన్నప్ప పుక్కిటినీరు,**
**ముక్కంటి అభిషేక మున కెల్ల ప్రొద్దు"**
**నేడును కన్నప్ప నిర్మాల్యమందు**
**పోడిగా శివునకు పూజసేయుదురు!**
**మృదుడు కన్నప్ప కర్పించిన గాని**
**అడరంగ నేడును ఆరగింపందు!**
**'కన్నర్పితముజేసె' కాన లోకముల**
**'కన్నప్ప' దనగ మహోన్నతి కెక్కె.."**

**(బసవ.పురా)**

ఇదీ కన్నప్పనాయనారుని కమనీయ భక్తిగాథ. 'భక్తతిన్నడు' గా తెలుగు వారు కన్నప్పగా కర్ణాటులూ, తమిళులూ కొలిచే భక్తాగ్రగణ్యుడీ కారణజన్ముడు.

శ్రీకాళహస్తీశ్వరుడు వాయులింగేశ్వరు డనటానికి గర్భాలయంలో నిశ్చలంగా వెలిగే అనేక దీపకళికలమధ్య రెండు కళికలు మాత్రం చలిస్తూ అగుపించడం 'ప్రత్యక్షసాక్ష్యం!' ఒకప్పుడు దేవతలూ, ఋషులూ, కన్నప్పలాంటి



భక్తులు తాకి పూజించిన స్వామి పవిత్రలింగ మిప్పుడు అర్చకులకు కూడ తాకకూడనిదట! అలాతాకిన పూజారి కొకరికి తాకిన చేతివ్రేలు బంగారమయ్యిందట. ఇప్పుడు తాకకనే అభిషేకాదులూ అలంకారాలూ జరుగుతుంటాయి. స్వామి దివ్యలింగంపై ఉన్న స్వర్ణకవచంపైనే అలంకారాదులు.

ఔరా! యుగయుగాల ఘనమహిమను చాటే శ్రీకాళహస్తీశ్వరుడు నిజకైలాసంలో 'భక్తతిన్నని' తన ముఖ్యగణాల్లో చేర్చుకొని ఆదరిస్తూ ఉండవచ్చుగాక! ఈ దివ్యక్షేత్రంలోమాత్రం స్వామితో సమానంగా మ్రొక్కులు గైకొంటూ భక్తుల చిక్కులు తీరుస్తున్నాడు.

ఇది 'భక్తునికీ భగవంతునికీ భేదం లేదు' అనడానికి నిదర్శనం. స్వామి ఆనకూడ.


chaya